Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 14.09.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 15 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

• తెలుగు రాజకీయ తెరపై...

# అపవిత్ర బంధం!



› తెలుగుబిడ్డలు తిరగబడతారా?

› ఎన్టీఆర్ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్‌కు అమ్మేశారా?

*తెలుగు జాతి ఆత్మ గౌరవం... తెలుగు పౌరుషం... తెలుగు భాష కమ్మదనం... తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం... ఇవేవీ చంద్రబాబుకు తెలియవు. తెలుసుకోవాల్సిన అవసరం కూడా ఆయనకు లేదు. ఎందుకంటే తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు చంద్రబాబు కాంగ్రెస్ పార్టీలో వున్నాడు. కాబట్టి ఎన్టీఆర్‌లోని కాంగ్రెస్ వ్యతిరేక భావజాలాన్ని, తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడడంపై ఆయనలోని పట్టుదలను చంద్రబాబుకు గమనించే అవకాశం లేకుండాపోయింది. కాబట్టే ఎన్టీఆర్‌కు అన్వయించదగిన ఈ మాటలు చంద్రబాబుకు అతకవు. అంతేకాదు, ఎన్టీఆర్ పార్టీని పెట్టినప్పుడు, ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకంగాని, ఎన్టీఆర్ సీఎం అవుతాడనే ధీమాగాని చంద్రబాబులో లేవు. ఉండుంటే ఆయన అప్పుడే తెలుగుదేశంలో చేరుండేవాడు కదా!*

ఎన్టీఆర్ పాటించిన సిద్ధాంతాలు, విలువలను చంద్రబాబు పాటించక పోతుండబట్టే ఈ రోజు ఆయన కాంగ్రెస్‌తో సైతం పొత్తుకు సిద్ధమయ్యాడు. తెలుగు దేశం పార్టీ 35ఏళ్ళ చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకుంది, కమ్యూనిష్టులతో అంట కాగింది, టీఆర్ఎస్, జనసేన వంటి పార్టీలతోనూ పొత్తు నడిచింది. అయితే ఇదంతా ఒకెత్తు, కాంగ్రెస్‌తో కలిసి ఎన్ని కలకు పోవాలనుకోవడం మరోఎత్తు. ఎన్టీఆరే వుంటే కలలో కూడా ఇది జరిగేది కాదు. కాని, చంద్రబాబు సగం బ్లడ్ కాంగ్రెస్‌దే! కాబట్టే కాంగ్రెస్‌ను ఎన్టీఆర్ చూసినంత విరోధంతో చంద్రబాబు చూడ్డం లేదు.

తెలంగాణకు ముందస్తు ఎన్నికలు ఖరారైన నేపథ్యంలో కాంగ్రెస్‌తో పొత్తుకు చంద్రబాబు సిద్ధమవడం జరిగింది. హైదరాబాద్‌కు వెళ్ళి టీ-టీడీపీ నేతలకు దీనిపై మార్గనిర్దేశం చేసారు. కాంగ్రెస్‌తో పొత్తును తెలంగాణ టీడీపీ నాయకులు కొందరు వ్యతిరేకించినా చంద్రబాబు ఖాతరు చేయలేదు. కాంగ్రెస్‌తో ఖచ్చితంగా కలిసి ఎన్నికలకు పోతున్నామని తేల్చి చెప్పేశాడు. తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీల మధ్య సీట్ల పంపకమే మిగిలి వుంది. తెలంగాణలో ఈ కాంబినేషన్ విజయవంతమైతే ఏపి ఎన్నికల్లోనూ ఇదే కాంబినేషన్ పునరావృతమవుతుంది.

అధికారం కోసం, రాజకీయ అవస రాల కోసం చంద్రబాబు ఎంతకైనా దిగ జారిపోతాడనేందుకు కాంగ్రెస్‌తో పొత్తే ఉదాహరణ. నిఖార్సయిన ఎన్టీఆర్ అభిమానులుగాని, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టినప్పుడు ఆయన వెంట వున్న నాయకులు కాని కాంగ్రెస్‌తో పొత్తును జీర్ణించుకోలేరు. చంద్రబాబు అంటే పూర్తి తెలుగుదేశం కాదు. హాఫ్ కాంగ్రెస్. మరి ఎన్టీఆర్ కుటుంబసభ్యుల పరిస్థితి ఏంటి? కాంగ్రెస్‌తో పొత్తును వాళ్ళు స్వాగతి స్తారా? చంద్రబాబు నిర్ణయాన్ని సమర్ధించి తమ తండ్రి (మిగతా 11వ పేజీలో)



## ముందస్తు.. ముంచుతుందా?

→ కేసీఆర్‌కు విషమ పరీక్ష

→ ఏకమవుతున్న విపక్షాలు

11లో




## జగన్‌కు తోడుగా రామ్

### దివంగత మాజీ సీఎంల తనయుల కలయిక

### వైసిపికి అపూర్వ కానుక



**ఇద్దరు మాజీముఖ్యమంత్రుల తనయులు వాళ్ళు. ఒకే పార్టీ నుండి వచ్చిన వాళ్ళు. ఒకరు ప్రజల కోసం మండుటెండలను, కుండపోత వర్షాలను లెక్కచేయకుండా ప్రజాసంకల్ప పాదయాత్రతో వేల కిలోమీటర్లు నడుస్తుంటే... మీకు నేను తోడుంటాను, మీ ప్రజాయజ్ఞంలో నేనూ భాగస్వామినవుతానంటూ మరొకరు ముందుకొచ్చారు. ఈ ఇద్దరు మాజీ సీఎంల తనయుల కలయికకు ఈ నెల 8వ తేదీన విశాఖ జిల్లాలోని పెందుర్తి నియోజకవర్గం వేదికగా నిలిచింది.**

దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 8వ తేదీన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు. రామ్‌కుమార్‌కు పార్టీ కండువా కప్పి జగన్ ఎంతో ఆత్మీయంగా పార్టీలోకి ఆహ్వానించాడు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో 7వ తేదీ మధ్యాహ్నమే వేలాదిమంది (మిగతా 11వ పేజీలో)

# గురువా... గూండానా?

- నెల్లూరు గిరిజన గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దాష్టికం
- సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన వైనం



పది పదిహేనేళ్ళ మధ్య వయసు పిల్లలు... తల్లిదండ్రులను వదిలొచ్చి దూరంగా వుంటున్నారు. వారి ఆలనా పాలనా వాళ్ళే చూసుకోవాలి. తల్లిదండ్రులకు దూరంగా వీళ్ళు... దూరంగా వున్న బిడ్డలు ఎలా వున్నారోనని తల్లిదండ్రుల ఆదుర్దా... ఇలాంటి పిల్లల బాధ్యత తీసుకున్న గురువులు వారి పట్ల ఎలా వ్యవహరించాలి. తల్లిదండ్రుల స్థానాన్ని తామే భర్తీ చేస్తున్నట్లుగా నడుచుకోవాలి. చిన్నపిల్లలది తెలిసీ తెలియని వయసు. అల్లరి చేస్తారు, చిన్నచిన్న తప్పులు చేస్తారు... అలాంటి సమయంలో పిల్లలను సుతిమెత్తంగా మందలించడంలో తప్పు లేదు. అంతేగాని చిన్నపాటి తప్పులకే ఆ పసిబిడ్డలను గొడ్డులను బాదినట్లు బాదుతారా? సొంత బిడ్డలు తప్పు చేస్తే ఇలాగే పశుప్రవర్తన చూపిస్తారా?

నెల్లూరు కొండాయపాలెం గేటు వద్ద వున్న గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ నిర్వాకం విని అధికారులే ఆవేదన చెందుతున్నారు. 2006 సంవత్సరంలో ఇక్కడ గిరిజన గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన సిహెచ్‌వి రమణ ఇక్కడ ప్రిన్సిపాల్‌గా వుంటున్నాడు.

గురుకులంలో విద్యార్థుల మెనూలో అక్రమాలనేవి షరా మామూలుగానే జరుగుతున్నాయి. సరిగా తిండి పెట్టక పిల్లలను మాడ్చడం ఒకెత్తయితే ఆ పిల్లలకు రెండేళ్లుగా ప్రిన్సిపాల్ రమణ నరకం చూపిస్తున్నాడు. ప్రిన్సిపాల్ ఆ విద్యార్థుల పట్ల శాడిస్ట్‌గా వ్యవహరించేవాడని, చేతికి ఏది దొరికితే దాంతో చావబాదేవాడని, తలను గోడకేసి కొట్టేవాడని, మేం ఏం తప్పు చేసాం సార్ అని అడిగితే ఇంకా ఎక్కువుగా కొట్టేవాడని ఒక విద్యార్థి కన్నీళ్ళతో చెప్పడం కలచివేసింది. ప్రిన్సిపాల్ శాడిజం చేష్టలను కొందరు సిబ్బందే సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ దారుణాలు వెలుగులోకి వచ్చాయి. గిరిజన సంఘాల నాయకులు గ్రీవెన్స్‌డేలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడం, విద్యార్థుల కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు ప్రిన్సిపాల్ రమణపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగాయి.

# బలిజ సంఘీయుల విరాళం



కేరళ వరద బాధితులకు సహాయార్థంగా నెల్లూరు జిల్లా బలిజ సంఘీయులు ఈనెల 12న నెల్లూరు కలెక్టరేట్‌లోని డీఆర్ఒ కార్యాలయంలో డీఆర్ఒకు రూ. 2,51,500లు విరాళాన్ని డీడీ రూపంలో అందజేసారు. ఈ సందర్భంగా బలిజ సంఘీయులు మాట్లాడుతూ భారతదేశానికి తలమానికంగా దక్షిణ భాగంలో దేవభూమి, పరశురామ గడ్డగా పిలవబడే కేరళ రాష్ట్రం ఇటీవల వరద తాకిడికి అతలాకుతలమైందని. మానవతా దృక్పథంతో వారిని ఆదుకోవాలనే తపనతో తమ వంతు విరాళాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రంలో సుంకర ఆదినారాయణ, కిన్నెర ప్రసాద్, కిన్నెర మాల్యాద్రి, నాగిశెట్టి బాబూరావు, నారా సుబ్బారావు, చదలవాడ హరి, బెల్లంకొండ లక్ష్మయ్య, పప్పు నారాయణ, కొట్టే వెంకటేశ్వర్లు, తేలపల్లి రాఘవయ్య, యండ్రపాటి వెంకటేశ్వర్లు, పాశం సునీల్, కోరెం ప్రవీణ్,, మామిడాల మధు, కోలపల్లి దివాకర్, కత్తెర మల్లి, పసుపర్తి సుధాకర్, అరిగెల కోదండరామయ్య, కందికట్ల రాజేశ్వరమ్మ, వివి సుబ్బయ్య పాల్గొన్నారు.

# విద్యా వాలంటీర్లకు అనుమతి లేదు

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో విద్యా వలంటీర్లను వినియోగించుకునేందుకు ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనమతులు అందలేదని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా విద్యా వాలంటీర్లను పాఠశాలల్లో వినియోగించరాదని, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఈ విషయం గమనించి, పాఠశాలలను తనిఖీలు చేసి విద్యా వాలంటీర్లు ఎవరైనా పాఠశాలల్లో పనిచేస్తుంటే వారిని ఆ విధులనుంచి తప్పించాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# 'సిరిధాన్యాలు' పుస్తకావిష్కరణ

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ఆరోగ్య ఆహార నిపుణుడు డాక్టర్ ఖాదర్‌వలీ రచించిన 'సిరిధాన్యాలు' పుస్తకాన్ని ఈ నెల 7న నెల్లూరులోని ఆచార్య ఆదిత్య కళాశాల సెమినార్‌హాల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ నిజమైన ఆరోగ్య సిరిసంపదలను చిరుధాన్యాలతోనే సాధించవచ్చన్నారు. రైతుసంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి చిరసాని కోటిరెడ్డి, మాలకొండయ్య, ఏవిఆర్ నాయుడు, సుబ్బారెడ్డి, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

దీర్ఘకాలంగా రవాణాశాఖ ఉద్యోగుల సమస్యలు తీర్చాలంటూ ఏపి ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ నాయకులు ఈనెల 7న నెల్లూరుకు విచ్చేసిన 11వ పిఆర్‌సి ఛైర్మెన్ అశుతోష్ మిశ్రాను కలసి వినతిపత్రం అందజేశారు. రవాణాశాఖ ఉద్యోగుల పేస్కేల్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, ఏఎంవిఐ పోస్టులకు ఆర్‌అండ్‌బి ఏఇఇ పేస్కేల్స్‌తో సమానంగా, ఆర్టీఓ పేస్కేల్‌ను ఎక్సైజ్ సూపరింటెండెంట్ పేస్కేల్‌తో, డిటిసి పే స్కేల్‌ను కమర్షియల్ టాక్స్ డిప్యూటి కమిషనర్ పేస్కేల్‌తో సమానంగా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కరిజం పై
# శిక్షణా తరగతులు

అంబేద్కర్ దర్మపోరాట సమితి ఆధ్వర్యంలో అంబేద్కరిజంపై ఈనెల 9న నెల్లూరు అంబేద్కర్‌భవన్‌లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రతి నెల రెండవ ఆదివారం క్రమం తప్పకుండా 30 క్లాసులను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎడిపియస్ రాష్ట్ర అధ్యక్షులు యరబోతు సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా డా. సోంప్రకాష్ (తిరుపతి) పాల్గొన్నారు. మాస్టర్‌గా ఇంగిలేల రామచంద్రరావు పాల్గొని బోధించారు. ఎడిపియస్ జిల్లా అధ్యక్షులు నిజమాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# పోలేరమ్మ జాతర

జిల్లాలోనే కాక రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో సైతం ఎంతో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి పోలేరమ్మ జాతర అక్టోబర్ 2, 3 తేదీల్లో అంగరంగవైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రయ్య తెలిపారు. ఈ జాతరకు పెద్దసంఖ్యలో జనం తరలివస్తారు కనుక, భక్తజనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసేందుకు త్వరలో అధికారులు, ప్రజలతో సమావేశం నిర్వహించిన అనంతరం తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. వెంకటగిరి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని విధాలైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఆ కారు తోలిందెవరు?

## ఇంకా వెలుగులోకి రాని నిందితుడి వివరాలు



ఈ నెల 9వ తేదీ రాత్రి నెల్లూరు దర్గామిట్టలోని యం.జి.బి మాల్‌లో ఓ సంఘటన జరిగింది. రాత్రి 10గంటల సమయంలో పార్కింగ్‌లో నుండి వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అక్కడే వున్న ఇద్దరు చిన్నారులను ఢీకొట్టింది. ఆ చిన్నారులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. కాని కారు తోలుతున్న వ్యక్తి కారును ఆపకుండా ముందుకు దూసుకుపోగా స్థానికులు కారును అడ్డగించారు. కారును తోలుతున్న వ్యక్తి పరారు కాగా, కారులో వున్న మిగతావాళ్ళు అక్కడే వుండిపోయారు. కారు సూళ్ళూరుపేటకు చెందిన వ్యక్తులదిగా గుర్తించారు. కారు తోలుతూ ప్రమాదానికి కారకుడైన వ్యక్తిని మిథున్‌రెడ్డి అని గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే అతను కండీషన్‌లో వుండే కారు తోలాడా లేక మద్యం మత్తులో వున్నాడా అన్నది తేలాల్సి వుంది. గాయపడిన చిన్నారులకు ప్రాణాపాయం లేదుగాని గాయాలతో ఆసుపత్రిలో కోలుకుంటున్నారు.

## వింజమూరు, రాపూరు హాస్టళ్ళపై
# ఏసీబీ దాడులు

నెల్లూరు జిల్లా వింజమూరు, రాపూరులోని వసతి గృహాలపై ఈనెల 10 న జిల్లా ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి నెల్లూరు ఏసీబీ డీఎస్పీ సీహెచ్ దేవదానం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. వసతి గదిలోని వంటగది, స్టాక్ రూం, మరుగుదొడ్లను పరిశీలించారు. బియ్యపు గంజి అక్కడే నిల్వ ఉండి దుర్వాస రావడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ దేవదానం విలేఖర్లతో మాట్లాడుతూ దాడులు జరిపిన సమయంలో సంక్షేమాధికారి వసతి గృహంలో లేరన్నారు. తాము సమాచారం ఇచ్చిన తర్వాత వసతి గృహానికి వచ్చారన్నారు. ప్రధానంగా ఈనెల 9న 174 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉన్నట్లు హాజరు పుస్తకంలో ఉందన్నారు. ప్రస్తుతం 64 మంది మాత్రమే ఉన్నారన్నారు. బాత్ రూములు సక్రమంగా లేవని, విద్యార్థులు బాత్ రూముల్లో పెట్టెలు పెట్టుకుని ఆరుబయట పడుకునే దుర్భర పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. వంటమనిషి సైతం వసతి గృహంలో లేరన్నారు. వసతి గృహానికి సంబంధించిన పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఏసీబీ సీఐ రమేష్ బాబు, సంక్షేమాధికారి జయరామయ్య, సిబ్బంది ఉన్నారు.

రాపూరులోని సాంఘీక సంక్షేమ సమీకృత వసతి గృహంలో ఏసీబీ అధికారులు ఈనెల 10 వతేది రాత్రి తనిఖీలు నిర్వహించారు. వసతి గృహంలోని విద్యార్థులను, హాస్టల్ సిబ్బందిని విచారించారు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, స్టాక్ నిల్వల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల హాజరులో 190 మంది ఉండగా ప్రస్తుతం 157 మంది ఉన్నట్లు గమనించారు. వసతి గృహంలో వార్డెన్ ఉండటం లేదని తెలుసుకున్నారు. సామగ్రి కొనుగోలుకు సంబంధించి బిల్లులు సక్రమంగా ఉన్నాయా, లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు శివకుమార్ రెడ్డి, రామకృష్ణ విలేఖర్లతో మాట్లాడారు. వసతి గృహంలో నెలకొన్న పరిస్థితులపై సాంఘీక సంక్షేమ అధికారులకు, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

# జగన్ సిఎం కావాలి

## - మాజీ ఎంపి వరప్రసాద్‌రావు పూజలు

వైఎస్సార్సీపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ తిరుపతి మాజీఎంపి వెలగపల్లి వరప్రసాద్‌రావు ఈనెల 7న పూజలు చేశారు. ఆ మేరకు గూడూరు రూరల్ మండలంలోని చెన్నూరులో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి అరాచక పాలన సాగుతోందని, ఆ పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు కల్లుగీత కార్మికులు ఆయన్ను కలసి తమ సమస్యలు చెప్పుకున్నారు. ప్రభుత్వం తమకు సబ్సిడీ రుణాలు కానీ, పింఛన్లు కానీ మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా ఉంటోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంతో పాటు, సుబ్బారావు, అంకయ్యగౌడ్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మ ఆలయంలో పవిత్రోత్సవాలు

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సూళ్ళూరుపేట శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 21 నుంచి 23వతేది వరకు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలను ఏర్పాటుచేసి, 25 మంది రుత్విక్కులతో పవిత్రోత్సవ హోమాలను నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీచక్రార్చన, చండీపారాయణం తదితర విశిష్ట కార్యక్రమాలను చేపడుతున్నామని, శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి ఆలయ శుద్ధి కోసం చేసే ఈ పవిత్రోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.



# PVR చేతికి.. మాగుంటోళ్ళ హాళ్ళు

- 71.69% వాటా విక్రయం
- స్పై సినిమాలు ఇకపై పివిఆర్ సొంతం

మాగుంట కుటుంబం అంటే ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాదు, భారతదేశంలోనే ప్రాముఖ్యత కలిగిన కుటుంబాలలో ఓ కుటుంబం. 1991లో మాగుంట సుబ్బరామరెడ్డి రాజకీయ అరంగేట్రం చేసే వరకూ ఈ కుటుంబం మూడు హాలోళ్ళుగానే నెల్లూరీయులకి పరిచయం. మూడుహాళ్ళ తర్వాతే మాగుంట కుటుంబం పేరు ప్రజల్లోకి వచ్చింది. తమ తండ్రి మాగుంట రాఘవరెడ్డి పేర రాఘవ సినీ కాంప్లెక్స్ అని నిర్మించి ఆ ప్రాంగణంలో కృష్ణ, కావేరి, కళ్యాణి అనే సినిమాహాళ్ళను ప్రారంభించారు. రాష్ట్రంలోనే ఈ మూడుహాళ్ళు అప్పట్లో పెద్ద ఆకర్షణగా నిలిచాయంటే అతిశయోక్తి కాదు.

తరువాత కాలంలో నెల్లూరులోని శేషమహల్, రంగమహల్, లీలామహల్, అలాగే చెన్నైలో వెంకటగిరి రాజాలకు చెందిన సత్యం సినిమాలను వీళ్ళు కొనుగోలు చేశారు. అయితే ఇప్పుడు ఆ కుటుంబంలో యువతరం వ్యాపార వ్యవహారాలు చూడడం ప్రారంభించాక మాగుంటోళ్ళ సినిమాహాళ్లు దేశ వ్యాప్తంగా విస్తరించాయి. దాదాపు 10నగరాలలో సత్యం, ఎస్కేప్, ప్లాజో, ది సినిమా మరియు యస్2 పేర్లతో 76స్క్రీన్‌లు త్వరత్వరగా ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే నెల్లూరులోని కృష్ణ, కావేరి, కళ్యాణిలు కూడా కొత్త హంగులు సమకూర్చుకుని యస్2 గా రూపాంతరం చెందాయి.

భారతదేశంలో ఇప్పటికే 53 నగరాల్లో 634 స్క్రీన్‌లు కలిగిన పి.వి.ఆర్ సినిమాస్ ఇప్పుడు మాగుంటోళ్ళ దగ్గర నుండి స్పై సినిమాస్‌లో 71.69 శాతాన్ని 633 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఈ డీల్‌లో నెల్లూరు మూడుహాళ్ళకు మినహాయింపు ఉంటుందా లేక అవి కూడా కలిపి కొన్నారా...? అన్న విషయం ఇంకా స్పష్టత రాలేదు. అయితే తాము అమ్మగా మిగిలిన వాటాతో ఇప్పుడు మాగుంట కుటుంబం పి.వి.ఆర్‌కి భాగస్వామ్యులుగా మారిపోయారు. సినిమాహాళ్ళ ద్వారా సంచలనాలు సృష్టించిన మాగుంట కుటుంబం ఇప్పుడు అదే సినిమాహాళ్ళ ద్వారా భారతదేశమంతా విస్తరించడం నెల్లూరుకు గర్వకారణమే. అయితే నెల్లూరులోని మూడుహాళ్ళని మాత్రం మాగుంటోళ్ళ హాళ్ళగానే వుంచేస్తే బాగుంటుందనేది మాగుంట అభిమానుల కోరిక.

# రచ్చకెక్కిన 'టౌన్‌హాలు'

**నెల్లూరు కళా రంగమంటే ముందుగా గుర్తొచ్చేది టౌన్‌హాల్. పేరుకి రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం అయినప్పటికీ టౌన్‌హాల్‌గానే ఈ కళామందిరం ప్రసిద్ధి. ఈ చారిత్రాత్మక మందిరంలో అడుగుపెట్టని కళాకారుడే లేడు. ఇక్కడ సభల్లో ప్రసంగించని రాజకీయ నేతలు కూడా బహుఅరుదు. నాటి తరం నుండి నేటి తరం వరకూ పలు రంగాల వారికి వేదికగా నిలుస్తూ రేపటి తరం కోసం కూడా తానెప్పుడూ సిద్ధం అన్న రీతిలో ఈ పురమందిరం ప్రజలకు అంకితమైంది. అయితే ఇప్పుడు అదే పురమందిరం రచ్చకెక్కింది.**



ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలకు వేదికగా నిలిచిన టౌన్‌హాలు ఇప్పుడు వివాదాలకు వేదికయ్యింది. రేబాల కుటుంబీకులు నిర్మించి ఇచ్చిన ఈ మహామందిరానికి 2003లో ప్రముఖ దాత, వ్యాపారవేత్త జె.యస్.రెడ్డి దాదాపు 40లక్షలు ఖర్చు చేసి కొత్త వైభవాన్ని తెచ్చాడు. టౌన్‌హాలుకి కొత్త హంగులు తేవాలన్న సంకల్పమైతే జె.యస్.రెడ్డి చేశాడు కాని ఆ బాధ్యతలను తమ ఉద్యోగులకి అప్పజెప్పాడు. అప్పట్లో మందిరంలో అలంకరించుండిన దాతలు, ప్రముఖుల ఫొటోలు "సోకు"గా లేవని తీసి దిబ్బలో వేశారు. లక్షల రూపాయలు విలువ చేసే పురాతన సామాగ్రిని మాయం చేశారు. జె.యస్.రెడ్డి పేరే ప్రముఖంగా కనపడేలా బోర్డులు చెక్కించారు.

ఇంతవరకూ బాగానే వుంది. అసలు టౌన్‌హాల్ బాధ్యతలు అప్పటివరకూ నిర్వహిస్తుండినవారిపైనే ఆధిపత్యాన్ని సాధించాలని జె.యస్.రెడ్డి ఉద్యోగులు చేసిన, చేస్తున్న ప్రయత్నాలే ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. ఎక్కడో బెంగుళూరులో వుంటూ ఓవైపు చిన్నపిల్లల పార్కు, మరోవైపు క్యాన్సర్ ఆసుపత్రి వంటి సేవా కార్యక్రమాలతో పాటు టౌన్‌హాల్ పునఃనిర్మాణం లాంటి మంచి సత్కార్యానికి కూడా శ్రీకారం చుట్టిన జె.యస్.రెడ్డిని అనవసరమైన వివాదాలలోకి లాగినట్లుగా అయ్యింది. అసలు నెల్లూరులో ఏం జరుగుతోంది. ఏం జరగాలి అన్న విషయాలలో ఆయనను తప్పుదోవ పట్టించి ఇంత డబ్బు పెట్టాం కాబట్టి దాతల కుటుంబసభ్యులపై కూడా మనమే ఆధిపత్యం చెలాయించాలనే ఆయన సిబ్బంది ఆలోచనే ఇప్పుడు బెడిసి కొట్టింది.

ముందునుండి రేబాల కుటుంబం తరపున ప్రాతినిధ్యం వహిస్తుండిన రేబాల హరిశ్చంద్రారెడ్డిని కమిటీ నుండి పీకేసి కేవలం రేబాల అన్న ఇంటి పేరున్న మరో వ్యక్తిని మొక్కుబడిగా సభ్యుడ్ని చేయడం వివాదాస్పదమయ్యింది. విషయం కోర్టు దాకా వెళ్ళింది. అందరికీ అందుబాటులో వుండాలన్న ధ్యేయంతో కోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని భారీ నిర్మాణాన్ని నెల్లూరు కళా రంగానికి రేబాల కుటుంబ సభ్యులు అంకితం చేస్తే, మేం బాగుచేశాం కాబట్టి పెత్తనం మాదే అంటూ జె.యస్. రెడ్డి ప్రతినిధులు ప్రవర్తించడం ఎవ్వరికీ మింగుడుపడలేదు. నెల్లూరులో వ్యాపార దృక్పథంతో నిర్మించిన కళ్యాణ మండపాలు, కన్వెన్షన్ సెంటర్ల తరహాలో టౌన్‌హాల్లో కూడా ప్రైవేట్ వ్యక్తులను శాశ్వతంగా ఏర్పాటు చేసి, వాళ్ళు చెప్పిందే వేదం వాళ్ళు చేసిందే శాసనంగా వారికి స్వాతంత్ర్యం ఇవ్వడంతో సామాన్యులకు "టౌన్‌హాల్" భారమై దూరమైపోయిందన్న ఆవేదన కూడా ఎక్కువగా వినపడుతోంది.

నెల్లూరులోని చారిత్రాత్మక సంస్థలు ఒక్కొక్కటిగా వివాదాలకు నిలయాలైపోతున్నాయి. వ్యక్తుల స్వార్ధ ప్రయోజనాల కోసం సంస్థలను నాశనం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో టౌన్‌హాల్ లాంటి చారిత్రాత్మక కళానిలయాన్ని రచ్చకెక్కనీయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత జిల్లా కళా రంగంపై వుంది.

జె.యస్.రెడ్డి కూడా తమ ప్రతినిధుల చెప్పుడు మాటలకు విలువివ్వకుండా క్రింది కోర్టు, కాకపోతే పైకోర్టు అనే రీతిలో కాకుండా సుహృద్భావ వాతావరణంలో సమస్య పరిష్కారానికి మార్గం చూపి, ఈ కళానిలయంతో పాటు ఆర్.యల్.రెడ్డి కుటుంబ పరువు నిలబెట్టాలన్నది నెల్లూరీయుల కోరిక.

## మా ఊపిరి.. మా ఉత్సాహం...

# భారతీయ జనతా పార్టీయే!

### ➢ నెల్లూరులో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్‌కు ఘనస్వాగతం

ప్రస్తుత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు వ్యక్తిగత కార్యదర్శిగా నెల్లూరు జిల్లా ప్రజలకు సుపరిచితుడైన వై.సత్యకుమార్(సత్య) ఇప్పుడు బీజేపీలో గురువుకు తగ్గ శిష్యుడిగా కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇటీవలే ప్రకటించిన బీజేపీ జాతీయ కార్యవర్గంలో జాతీయ ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన సత్యకుమార్ పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో తనకెంతో ఇష్టమైన, తనకెంతో అనుబంధమున్న నెల్లూరు నగరానికి ఈ నెల 12వ తేదీన విచ్చేసాడు. ఆరోజు ఉదయం చెన్నై నుండి బయలుదేరిన సత్యకు సింహపురి హాస్పిటల్ జంక్షన్ వద్ద బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. సత్యను పూలమాలలతో ముంచెత్తారు. అక్కడనుండి ర్యాలీగా బయలుదేరి మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నాయకులు కార్యకర్తలతో కొంతసేపు ముచ్చటించి, జిల్లాలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. అనంతరం నెల్లూరు పురమందిరంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నాడు. ప్రతి కార్యకర్త బీజేపీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని, ప్రపంచానికి భారత్‌ను విశ్వగురువుగా మలచిన నరేంద్ర మోడీని మళ్ళీ ప్రధానిని చేయాలని సత్యకుమార్ పిలుపునిచ్చారు. మన ఊపిరి మన ఉత్సాహం బీజేపీయేనని, ఒంట్లో శక్తి, కంఠంలో ఊపిరి వున్నంతవరకు బీజేపీ కోసమే పనిచేస్తామని పేర్కొన్నాడు. 2019 ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా ఉద్యమించి ఢిల్లీలో మరోసారి బీజేపీ జెండాను ఎగురవేయాలని చెప్పాడు. ఈ సందర్భంగా సత్యను, బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికైన పి.సురేంద్రరెడ్డిని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



నెల్లూరులో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సత్యకుమార్


గూడూరులో సత్యను ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు బొమ్మిప్రసాద్

# స్వగ్రామంలో సమస్యలపై స్పందించిన రంగారెడ్డి



తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తమ స్వగ్రామమైన అల్లూరు మండలం నార్త్ మోపూరులో ఈ నెల 9వ తేదీన పర్యటించాడు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాడు. టీటీడీచే నిర్మిస్తున్న గుడిని పరిశీలించి, గుడి పూర్తి కావడానికి అవసరమైన సహకారం అందిస్తానని ఎస్సీ కాలనీ వాసులకు హామీ ఇచ్చాడు. ఎస్సీ కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంపై చర్చించాడు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# పాపం పండింది!

**దేశం మొత్తాన్ని భయభ్రాంతుల్ని చేసిన హైదరాబాద్ జంటపేలుళ్ల కేసులో దోషుల్ని దర్యాప్తు బృందం వెంటనే పట్టుకోగలిగి ఉంటే, వారిపై పటిష్టమైన సాక్ష్యాధారాలతో కేసులు పెట్టివుంటే న్యాయస్థానంలో ఎప్పుడో తీర్పు వచ్చి ఉండేది. కానీ, దర్యాప్తులో బాగా జాప్యం జరగడంతో ఈ కేసులో ఇద్దరికి ఉరిశిక్ష పడినా, ఈ దారుణ మారణకాండకు అసలు సూత్రధారులైన భత్కల్ సోదరులు మాత్రం పాకిస్తాన్‌కు పరారైపోయారు. వారికి కూడా శిక్షలు పడిననాడే బాధితులకు పూర్తిస్థాయి ఊరట.**

మన దేశంలో ఎప్పుడూ ఇంతే. ఆరంభశూరత్వం అనే మాటకు నిలువెత్తు నిదర్శనాలు మనవాళ్లు. అందులోనూ అధికార యంత్రాంగమైతే అలక్ష్యానికి మారుపేరు. ఎంతటి చిన్నపనికైనా రోజులు, నెలల తరబడి కాలయాపన చేస్తుండడం మనకు రివాజు. అది ఎంత ప్రమాదకరమైన విషయమైనా సరే, అత్యవసరమైనా సరే..అప్పటికప్పుడు హడావిడి, గందరగోళం ఉంటుందే తప్ప ఆ తర్వాత అంతా షరా మామూలే. ఒక్క హైదరాబాద్‌నే కాదు, దేశం మొత్తాన్ని భయభ్రాంతుల్ని చేసిన గోకుల్‌చాట్, లుంబినీ పార్కు జంటపేలుళ్ళ కేసులో దోషుల్ని పట్టుకునే విషయంలో కూడా జరిగిందిదే. సంబంధిత దర్యాప్తు బృందం దోషుల్ని వెంటనే పట్టుకోగలిగి ఉంటే, వారిపై పటిష్టమైన సాక్ష్యాధారాలతో కేసులు పెట్టివుంటే న్యాయస్థానంలో తీర్పు ఎప్పుడో వచ్చి ఉండేది. కానీ, ఏళ్ళ తరబడి దర్యాప్తు బృందాలు కష్టించినా కేసులో ఆశించినంత పురోగతి సాధించలేకపోవడం, ఈ కేసులో ఇద్దరికి శిక్ష విధించినా మరో ఇద్దరి విషయంలో నేరాన్ని రుజువు చేయగలిగే సాక్ష్యాధారాలు లేకపోవడం, కేసు దర్యాప్తు బాగా జాప్యం కావడంతో పాత్రధారులు దొరికినా, అసలు సూత్రధారులైన భత్కల్ సోదరులు మాత్రం దేశం దాటి పాకిస్తాన్‌కు పరారైపోవడంతో ఈ దుర్ఘటనకు గురైన బాధితులకు ఆశించిన ఊరట లభించలేదనే చెప్పాలి.

ఉగ్రదాడులతో పవిత్ర భారతదేశ సమైక్యతను, సమగ్రతను సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న ఉగ్రవాదుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ సహించరాదు. హత్యాకాండలు, దారుణ మారణ కాండలతో అమాయక ప్రజల్ని బలితీసుకుంటూ, దేశాన్ని మరుభూమిగా మార్చాలన్నదే నరరూప రాక్షస్తులైన ఉగ్రవాదుల లక్ష్యం. పదకొండేళ్ళ క్రితం హైదరాబాద్ నడిబొడ్డున జరిగిన ఈ ఘోరం వారి కుట్రలోని భాగమే. 2007లో గోకుల్‌చాట్, లుంబినీపార్కుల్లో ఉగ్రవాద ముష్కరమూకలు పేల్చిన బాంబుల ధాటికి 44 మంది అమాయకులు అసువులు బాశారు. మరో 68 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ కేసులో నిందితులైన అనిక్ షఫీద్ సయ్యద్, మహ్మద్ అక్బర్ ఇస్మాయిల్ అనే ఇద్దరికి ఉరిశిక్ష పడింది. రియాజ్ భత్కల్, అతని సోదరుడు ఇక్బాల్ భత్కల్‌లకు ఆశ్రయమిచ్చిన మరో నిందితునికి యావజ్జీవ శిక్ష పడింది. మరో ఇద్దరు నిందితులు నిర్దోషులని న్యాయస్థానం ప్రకటించింది. అయితే, ఎప్పటికైనా సరే.. ఈ దారుణ మారణకాండకు మూలకారకులైన భత్కల్ సోదరులను కూడా శిక్షించగలిగితేనే బాధితులకు పూర్తిస్థాయి ఊరట కలుగుతుందని వేరే చెప్పనక్కరలేదు.

ఈ జంట పేలుళ్ళ ఉదంతంలో బాధితులు ఎందరో నేటికీ నిత్యవేదన పడుతూనే ఉన్నారు. ఆప్తులను పోగొట్టుకుని అనాధలైనవారు కూడా ఉన్నారు. గాయాలపాలైనవారు అంగవైకల్యంతో బాధలు పడుతున్న వారు, వారిలో కదల్లేని పరిస్థితుల్లో ఉన్నవారు కూడా ఎందరో అభాగ్యులు ఉన్నారు. ఉగ్రదాడులతో వారు భయకంపితులైపోయారు. ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాదులు మహారాష్ట్రలోని పుణేలో ఈ దారుణానికి పన్నాగం పన్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుడుకు ఉగ్రవాదులు కుట్రపన్నినా, అదృష్టవశాత్తు టైమర్ సరిగా పనిచేయకపోవడంతో అక్కడ పెనువిషాదం తప్పినట్లయింది. ఏదేమైనా, ఇన్నేళ్ళ తర్వాతనైనా ఈ జంటపేలుళ్ళ కేసు ఒక కొలిక్కి రావడం విశేషమే. అయితే, ఇప్పుడు దోషులిద్దరికీ పడిన ఉరిశిక్షను హైకోర్టు ఖరారు చేయాల్సి ఉంటుంది. అక్కడ వచ్చే ఫలితాన్నిబట్టి రాజ్యాంగం ప్రకారం ఇతరత్రా మార్గాలు అందుబాటులో ఉండొచ్చు. చివరికి ఏం జరుగుతుందన్న విషయాన్నలా ఉంచితే, ఈ పేలుళ్ళ కేసు దర్యాప్తులో ఇంతకాలం జాప్యం జరిగిన తీరు మాత్రం మన పోలీసు యంత్రాంగం, లేదా దర్యాప్తు బృందాల పనితీరుకు నిదర్శనంగా అనిపిస్తుంది. ఈ దారుణాలకు పాల్పడిన ఉగ్రవాదులను వెంటనే వెంటాడి పట్టుకుని సాక్ష్యాధారాలతో సహా కేసులు పెట్టివుంటే న్యాయస్థానాలు అందుకు తగ్గ శిక్షను త్వరగా ఖరారు చేసేందుకు వీలయ్యేది.విచారణ కూడా సత్వరం ముగిసి తగు శిక్షలు ఎప్పుడో పడుండేవి. ఈ కేసులో అలా జరగకపోవడమే విచారకరం. అయితే, ఇక్కడొక విషయం మాత్రం స్పష్టం. అనేక కేసుల్లో సరైన సాక్ష్యాధారాలను సేకరించలేక, దోషుల్ని రుజువు చెయ్యడంలో దర్యాప్తు బృందాలు వైఫల్యం చెందుతూనే ఉన్నాయనే విమర్శ లున్నాయి. ఫలితంగా నేరం జరిగి ఏళ్ళు గడుస్తున్నా విచారణ మాత్రం ముగియడం లేదు. ఈ కేసులో దాదాపు పదకొండేళ్ళ తర్వాత నిందితులకు శిక్షలు పడ్డాయంటే ఎంత కాలయాపన జరిగిందో ఇట్టే తేటతెల్లమవుతోంది. ఉగ్రవాదుల్ని మట్టికరిపించే ప్రత్యేకమైన గట్టి యంత్రాంగం, దేశవ్యాప్తంగా ఉగ్ర సమాచారాన్ని రాబట్టే ప్రత్యేక నిఘా వ్యవస్థలు లేకపోవడం, రాష్ట్రాల మధ్య, ఆయా శాఖల మధ్య ఈ విషయంలో అసలు సమన్వయం లేకపోవడం మన యంత్రాంగంలో ఒక పెద్ద లోపం. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని గొప్పలు ప్రకటించుకోవడం తప్ప, అందుకు తగ్గ పటిష్టమైన భద్రత, సరైన నిఘా వ్యవస్థలు మనదేశంలో లేకపోవడమే శాపం. ప్రజల్లో భయోత్పాతం సృష్టించడం, దారుణ మారణకాండలు సృష్టించి రాక్షసానందం పొందడం, తద్వారా తమ ఉనికిని చాటుకోవడం ఉగ్రవాదుల లక్షణం. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అలా పడగవిప్పిన ఆ విషనాగుల్ని అందరూ కలసి, అన్నిదేశాలూ సమాలోచనలతో సమన్వయంగా కదలి ఆ ఉగ్రవాద రాకాసులను సమూలంగా మట్టుపెట్టడమొక్కటే సరైన మార్గం.

ప్రపంచవ్యాప్తంగా మానవాళిపై, శాంతిసామరస్యాలపై భీకరంగా బుసలుకొడుతున్న ఉగ్రవాద విషసర్పాన్ని నిలువరించాలంటే అంతకు పదింతల పటిష్టమైన యంత్రాంగం కావాలి. ఒక్క క్షణమైనా ఏమరుపాటు ఉండని నిఘా వ్యవస్థ ఉండాలి. అలుపెరుగక శ్రమించే దర్యాప్తు బృందాలుండాలి. అందుకు వెంటనే కేంద్రం మరింత పటిష్టమైన వ్యూహంతో సత్వర కార్యాచరణకు దిగాలి. ఉగ్రవాద విషవృక్షాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేసేదాకా విశ్రమించని పటిష్ట యంత్రాంగం ద్వారా మాత్రమే ఇది సాధ్యం.

# ఎన్టీఆర్ ఆత్మ క్షోభించేలా చంద్రబాబు చర్యలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడైన దివంగత నేత ఎన్‌టీ రామారావు ఆత్మ క్షోభించేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, తెలంగాణాలో కాంగ్రెస్‌తో టీడీపీ పొత్తు పెట్టుకుంటుందని, ఏపీలో లేదని చెబుతున్న చంద్రబాబు వైఖరి మార్చుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నాడు. ఈనెల 10న నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కమ్యూనిస్టుల వ్యవహారశైలే బాబుదని, ప్రధాని నరేంద్రమోదీ వ్యతిరేకతనే అజెండాగా తీసుకుని ప్రతిపక్షాలు భారత్ బంద్‌కు పిలుపునివ్వడం సరికాదన్నాడు. పెట్రోలు, డీజిల్‌పై వస్తున్న ఆదాయంపైనే రాష్ట్రాలలో పరిపాలన కొనసాగించగలుగుతున్నాయని, పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే రాష్ట్రాలకు ఆదాయ వనరులు తగ్గిపోతాయనే భయం నెలకొందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, అయితే పార్లమెంట్‌లో ఏకాభిప్రాయానికి రావడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికుల విషయంలో నెల్లూరునగర కార్పొరేషన్ నిద్రపోతోందన్నారు. గత కొన్ని రోజులుగా వారంతా సమ్మె కొనసాగిస్తుంటే కమీషనర్‌కు గాని, మేయర్‌కు గాని చీమ కుట్టినట్లుగా కూడా లేదన్నారు. చర్చలు జరిపి విషయాన్ని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే నగర ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, నాయకులు మండ్ల ఈశ్వరయ్య, చిరంజీవి, సుధాకర్‌రెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, మొగరాల సురేష్, కాయల మధు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరిదేవికి వేడుకగా లక్షకుంకుమార్చన

శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ఈనెల 7న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం భక్తజనులతో కిటకిటలాడింది. ఆలయంలోని ప్రత్యేక మండపంలో విశేషమైన అలంకారంతో కొలువుదీరిన అమ్మవారికి మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ, ఉప ప్రధానార్చకుడు కుప్పచ్చి సుబ్బారావు, ముఖ్య అర్చకుడు రఘురామమూర్తి, వేదపండితులు అవ్వారు రామకృష్ణ అవధాని పూజా కార్యక్రమాలను ఎంతో వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. దేవస్థానం ప్రాంగణాన్ని చీరలతో వేడుకగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీలు పడ్డారు. ధర్మకర్త రత్నం జయరామ్, ఇ.ఓ శ్రీనివాసరెడ్డిలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలి

అడ్డగోలు విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి, విభజనకు మేం సుముఖం అంటూ లేఖ ఇచ్చి విభజనకు కారకుడవడమేకాక అదే కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తు పెట్టుకుంటున్న చంద్రబాబునాయుడుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలి. చంద్రబాబు తన దుర్మార్గపు పాలనతో ఏపిని నాశనం చేశాడు. ఆయన మళ్ళీ వస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటేగాని అప్పులు తీరే పరిస్థితి ఉండదు. కాబట్టి ప్రజలంతా కలసికట్టుగా ఆయనను సాగనంపాలి.

**జి.వి.పురుషోత్తం, కలకపాడు.**

# పెట్రోల్‌ను జిఎస్టీలోకి తేవాలి!




అన్ని వస్తువులలాగే పెట్రోల్ ధరలను కూడా జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి. ఇందుకు కేంద్రం సంసిద్ధం కావాలి. జిఎస్టీ పరిధిలోకి వస్తేనే పెట్రోల్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి. పెట్రోల్ ధరలు పెరుగుతుండడం వల్లే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోంది. చంద్రబాబు లాంటివాళ్ళు పెట్రోల్ ధరల గురించి కేంద్రంపై విమర్శలు చేస్తున్నారు. పెట్రోల్‌పై అత్యధిక పన్నులు వసూలు చేస్తున్నది తెలుగుదేశం ప్రభుత్వమే! పెట్రోల్‌ను జిఎస్టీ పరిధిలోకి తేవడానికి చంద్రబాబు అంగీకరించడం లేదంటున్నారు. పెట్రోల్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావడానికి ఎవరెవరు అంగీకరించడం లేదో ఆ సంగతి బహిర్గతం చేయాలి. వాళ్ళ విషయాన్ని ప్రజలు చూసుకుంటారు.

**లెక్కల సతీష్‌రెడ్డి, నెల్లూరు.**

# దారి తప్పుతున్న సోషల్ మీడియా!

సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి మంచి చేసేదిగా వుండాలేగాని విచ్ఛిన్నం చేసేదిగా వుండకూడదు. ఇప్పుడు సోషల్ మీడియా రాజ్యమేలుతోంది. ప్రతిఒక్కరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు దర్శనమిస్తున్నాయి. ఫేస్‌బుక్ ప్రేమలు పెరిగాయి. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న పరిచయాల ద్వారా ఎన్నో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అక్రమ సంబంధాలు ఏర్పడుతున్నాయి. ఇటీవల తమిళనాడులో ఓ వివాహిత ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన ప్రియుడి కోసం తన ఇద్దరు బిడ్డలకు విషం ఇచ్చి చంపిన దుర్మార్గపు సంఘటన పాషాణ హృదయాలను సైతం కలచివేసింది. సోషల్ మీడియా మూలంగా ఇలాంటి లెక్కలేనన్ని అకృత్యాలు నిత్యం జరుగుతూనే వున్నాయి. **– చంద్రశేఖర్.పి, చెన్నై.**

● హౌస్ ఫర్ ఆల్‌కు హైకోర్టు బ్రేక్



# నీళ్లొస్తే వీ(ఇ)ళ్ల గతేంటి?

**కాలువలను ఆక్రమిస్తున్నాం, వాగులను ఆక్రమిస్తున్నాం... చివరకు నదులనూ ఆక్రమిస్తున్నాం, కొన్ని దేశాలలో అయితే సముద్రాలను కూడా ఆక్రమించేసి నగరాలను కడుతున్నారనుకోండి... వారితో పోలిస్తే మనం చాలా నయం. ఇలా కాలువలు నదులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తాం. ఖర్మకాలి ఏదో ఒక సంవత్సరం భారీ వర్షాలు పడి వరదలొస్తే... కాలువలు, నదులు ఉప్పొంగి సమీపంలోని నిర్మాణాలు మునిగిపోతే దానికి బాధ్యులెవరు? ఏది కూడా సంఘటన జరగనంతవరకు బాగానే వుంటుంది. జరగరానిది జరిగితే అప్పుడు ఏడ్చి ఏం లాభం!**

నెల్లూరు, వెంకటేశ్వరపురంలోని యాష్‌పాండ్ స్థలంలో సర్వే నెంబర్ 2062, 2332, 2214-2, 2217, 2218, 2219, 2222లలో రాష్ట్ర ప్రభుత్వం హౌస్ ఫర్ ఆల్ స్కీం క్రింద 6వేల ఇళ్లతో గృహ సముదాయాలను నిర్మించడం తెలిసిందే! మున్సిపల్ మంత్రి నారాయణ చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని తన కలల పంటగా ఈ ఇళ్లను నిర్మించారు. ఒకటికి పదిసార్లు ఆయన వీటిని పరిశీలించడం జరిగింది. ఇటీవల లబ్దిదారులకు గృహాల కేటాయింపు కూడా జరిగింది. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు రావడం, ఈ ఇళ్లను ప్రారంభించడమే తరువాయి అనుకుంటున్న తరుణంలో నెల్లూరుకు చెందిన పల్లవరం జయ, షేక్ రసూల్, షేక్ బీబీజాన్, లేబూరు కామాక్షి, కొత్తూరు లక్ష్మి అనేవాళ్ళు ఈ ఇళ్లను పెన్నా పరివాహక ప్రాంతంలో కడుతున్నారని, వాటర్ బాడీ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో ఇళ్లు కట్టడం చట్ట విరుద్ధమని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. పెన్నకు వరదలొస్తే ఈ ప్రాంతంలో ఇళ్లన్నీ మునిగిపోతాయని, ప్రాణ నష్టం, ఆస్థి నష్టం సంభవిస్తుందని వారు ఆ పిటిషన్‌లో పేర్కొనడం జరిగింది. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దీనిపై వివరణ (మిగతా 11వ పేజీలో)

## అధినేతతో నాలుగు మాటలు.. కప్ప కాఫీ...

# అందరూ దారిలో పడతారు!



**నెల్లూరుజిల్లా వైసిపిలో అలకలని, అసంతృప్తని, కొందరు నాయకులు పార్టీ వదిలిపోబోతున్నారని, జగన్‌కు భారీ షాక్ ఇవ్వనున్నారనీ ఇటీవల సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెట్టేస్తున్నారు. వైసిపిలో జరిగే గోరంత దాన్ని కొండంతగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. కాని ఇక్కడంత సీన్ లేదు. ఎవరూ పార్టీని వదిలి పోయే పరిస్థితి లేదు. తెలుగుదేశంలో చేరే అవసరం అంతకన్నా లేదు. ఇవన్నీ కూడా వైసిపి అధినేత జగన్ స్వయంగా కలుగజేసుకుని నాలుగు మాటలు మాట్లాడితే సర్దుబాటయ్యేవే!**

మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పార్టీలోకి తీసుకోవడం వల్ల వైసిపిలో కొంత అలజడి రేగింది. ముఖ్యంగా వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురయ్యాడు. ఆయన అలగడంలో అర్ధముంది. వెంకటగిరిలో వైసిపికి ఎవరూ లేనప్పుడు ఆయనే ఇన్‌ఛార్జ్ అయ్యాడు. నాలుగున్నరేళ్ళు సొంత ఖర్చులతోనే కార్యక్రమాలను నడిపాడు. వెంకటగిరి సీటుపై ఆయన ఎన్నో ఆశలు పెట్టుకుని వున్నాడు. ఇప్పుడు ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరాడు. వెంకటగిరి టిక్కెట్ ఆయనదేనని ప్రచారం వుంది. ఆనంను పార్టీలోకి తీసుకునే ముందు జగన్ ఒక్క మాట రాఘవతో మాట్లాడివుంటే సరిపోయేది. ఏ పరిస్థితుల్లో ఆనంను పార్టీలోకి తీసుకోవాల్సి వచ్చిందో చెప్పి, ఆనంకు వెంకటగిరి సీటు ఇచ్చే విషయమై ముందుగానే చెప్పి ఒప్పిస్తే ఇక్కడ పెద్ద సమస్య లేదు.

ఆనంను పార్టీలోకి తీసుకోవడం వల్ల మేకపాటి సోదరులు అలిగారనే ప్రచారమూ వుంది. జగన్ మీద వాళ్ళు అలగాల్సిన అవసరమే లేదు. అసలు ఆనం రామనారాయణరెడ్డిని పార్టీలోకి తీసుకోవాలన్న తొలి ఆలోచనే మేకపాటి గౌతంరెడ్డిది. బీజం వేసింది వాళ్ళే అయినప్పుడు ఆనంను తీసుకోవడంపై వాళ్ళు అలగడమెందుకు? అదీగాక వైసిపిలో ఆ కుటుంబానికి వున్న ప్రాధాన్యత ఇంకే కుటుంబానికి వుంది? వాళ్ళు వైసిపిని వదిలిపోతే వాళ్ళ నెత్తిన వాళ్ళు మట్టి చల్లుకున్నట్లే! ఎందుకంటే వైసిపి వాళ్ళకు బలంగాని, వైసిపికి వాళ్ళు బలం కాదు. కావలి విషయంలో కూడా స్వయంగా జగన్ కలుగుజేసుకుంటే ఇక్కడ కూడా పార్టీ గాడిలో పడుతుంది. జగన్ స్వయంగా కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిలతో మాట్లాడితే ఇద్దరూ దారికొస్తారు. జిల్లాలో కొంతమంది నాయకులతో జగన్ స్వయంగా మాట్లాడాల్సి వుంది. దాదాపు 8ఏళ్లుగా తన వెంట నడుస్తున్న వారిని నొప్పించకుండా, కొత్తగా వస్తామన్న వారిని కాదనకుండా ఆయనే స్వయంగా మాట్లాడితే జిల్లాలో పార్టీ పరిస్థితి ఇంకా మెరుగవుతుంది.




18వ వర్ధంతి



కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి

మా భాష్పాంజలి

భార్య

జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు

కుటుంబసభ్యులు



## వీధుల్లో గబ్బు..
# పొంచివున్న జబ్బు

పారిశుధ్య కార్మికులు సమ్మెకి దిగి నెలరోజులు కావొస్తుంది. 279 జీ.ఓను రద్దు చేయాలంటూ కార్మికులు చేస్తున్న సమ్మెను విరమించే దిశగా పాలకులు ఇంతవరకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. మొన్న జరిగిన నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలోనూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నెల్లూరు నగర వీధుల్లో టన్నుల కొద్ది చెత్త పేరుకుపోయింది. చెత్త ఒకట్రెండు రోజులు ఎత్తకపోతేనే కుళ్లు కంపు కొడుతుంది. అలాంటిది నెలరోజులుగా ఒకేచోట చెత్త వుంటే పరిస్థితి ఏంటి? చాలా దారుణంగా వుంది. వీధులు దుర్గంధంగా మారాయి. ఆ వీధుల్లో వెళ్లాలంటేనే ముక్కులు మూసుకుని ఊపిరి బిగపట్టి పోవాల్సి వస్తోంది. కుళ్లిపోయిన చెత్త మూలంగా నగరంలో వ్యాధులు ప్రబలే అవకాశాలూ లేకపోలేదు. ఈ చెత్త ద్వారా బ్యాక్టీరియా వ్యాపిస్తుంది. ముదురుదోమలు పెరుగుతాయి. ఇప్పటికే నగరంలో వైరల్ జ్వరాలు పెరిగాయి. అసలే ఇది రోగాల సీజన్. ఈ చెత్త మూలంగా మరిన్ని రోగాలు ముసిరే అవకాశముంది.

# పదోన్నతులు కల్పించకుంటే పోరుబాట

### వీఆర్వోల హెచ్చరిక



గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న తమకు పదోన్నతులు కల్పించకుంటే పోరుబాట తప్పదని వీఆర్ఓల సంఘం హెచ్చరించింది. ఇటీవల నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో సంఘం అధ్యక్షులు పంట అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వీఆర్ఓలందరికీ పదోన్నతులు కల్పించాలని తాము చేసిన ఆందోళనపై స్పందించిన ప్రభుత్వం అధ్యయనానికి కమిటీ వేసిందని, రెండు నెలల్లోనే నివేదికను అందజేస్తామన్న కమిటీ ఇంతవరకు నివేదికను సమర్పించకపోవడం దారుణమన్నారు. వీఆర్ఓల పదోన్నతులపై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసారు. తమ నిరసనలో భాగంగా ఈ నెల 15, 16, 17, 18 తేదీలలో కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు, ఆ తర్వాత పెన్‌డౌన్ కార్యక్రమాలు, అనంతరం విజయవాడలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి దారా వెంకట రమణయ్య, కోశాధికారి హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేరళ బాధితులకు
## రైస్ మిల్లర్స్ చేయూత

కేరళ వరదబాధితుల సహాయార్థం నెల్లూరులోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు ఈ నెల 9న 85 క్వింటాళ్ళ బియ్యాన్ని అందజేశారు. బియ్యం బస్తాలను కేరళకు తరలించేందుకు బాలాజీ వేర్ హౌసింగ్ కంపెనీ సహకారం అందించింది. ఎఫ్‌సిఐ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో బియ్యం లారీని కేరళకు పంపి వరద బాధితులకు పంపిణీ చేశారు. కేరళ వరద బాధితుల కోసం బియ్యాన్ని, వాటిని పంపడానికి లారీని ఉచితంగా అందించిన వారిని ఎఫ్‌సిఐ జిల్లా అధికారి గురుప్రసాద్ తదితరులు అభినందించారు.

## వేదవ్యాస
## విద్యార్థిని ప్రతిభ

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న వేదవ్యాస ఇంగ్లీష్‌మీడియం 9వ తరగతి విద్యార్థిని దృశ్యసాజన్ తన ప్రతిభను చాటుకుంటోంది. తాజాగా తమిళనాడులోని స్టార్ విజయ్ టీవీ ఆడిషన్స్‌లో పాటల పోటీకి ఆమె ఎంపికైంది. 'పాడుతా తీయగా' ఎపిసోడ్‌లో ఆమె ఫైనల్‌కు చేరుకుందని, 'పులకించని మది పులకించె'... అనే పాటకు ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నుంచి బహుమతిని అందుకుందని పాఠశాల డైరెక్టర్ ఏపి వేదగిరి ఆ విద్యార్థినికి తమ అభినందనలు తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

# అంతంతమాత్రంగా బంద్



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన నెల్లూరు రోడ్డు

పెట్రోల్, డీజిల్ రేట్లకు నిరసనగా వామపక్షాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపు 10వ తేదీ నెల్లూరులో పాక్షికంగా జరిగింది. వామపక్షాల బంద్‌కు కాంగ్రెస్‌తో పాటు అధికార తెలుగుదేశం పార్టీ కూడా మద్దతు పలకడం జరిగింది. దీంతో బంద్ ప్రభావం బాగానే కనిపించింది. బంద్ అనగానే ముందుగా విద్యాసంస్థలకు యాజమాన్యాలే సెలవు ప్రకటించేస్తున్నాయి. కాబట్టి వాటిని ప్రత్యేకంగా మూయించాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇక ప్రభుత్వ కార్యాలయాలను ఎలాగూ తెరువరు. వ్యాపార వాణిజ్య సంస్థల వాళ్ళు మాత్రం ఎందుకొచ్చిన తలనొప్పిలే అనుకుంటూ ఒక పూట మూసేస్తున్నారు. 10వ తేదీ కూడా బంద్ సందర్భంగా అలానే చేసారు. మధ్యాహ్నం దాకా బస్సులు కూడా తిరగలేదు. వామపక్ష, కాంగ్రెస్ కార్యకర్తలు జెండాలు పట్టుకుని అక్కడక్కడా రోడ్లపై కనిపిస్తూ మేము బంద్ చేస్తున్నామనిపించారు.

# ముస్లింలకు బంగారు కొండ బాబే



సక్సెస్‌మీట్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ముస్లిం మైనార్టీల పాలిట ముఖ్యమంత్రి చంద్రబాబు బంగారు కొండ అని, ముస్లింల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన ఎంతో తపనపడుతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన గుంటూరులో ఏర్పాటు చేసిన 'నారా హమారా – టిడిపి హమారా' సదస్సు విజయవంతమైన సందర్భంగా 9వ తేదీ నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీద మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై చంద్రబాబుకు పూర్తి అవగాహన వుందని, కాబట్టే ఆయన ముస్లింల ఉన్నతికి పాటుపడగలుగుతున్నాడని చెప్పారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి కోసం 1100 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ చంద్రబాబును మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి సేవలు అభినందనీయం

### - ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి

జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) సామాజిక సేవలు ఎంతో అభినందనీయమని ఏఎస్పీ పరమేశ్వరరెడ్డి (అడ్మిన్) అన్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న ఎల్ఐసి 62వ వారోత్సవాల ముగింపు సభ నగరంలోని ఎన్జీఓ హోంలో జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ చేతుల మీదుగా లెప్రసీకాలనీ, నిర్మల్‌హృదయ్, ప్రగతి మానసిక వికలాంగుల సంస్థ, విశ్వభారతి అంధుల పాఠశాల, గొల్లపల్లి అనాధాశ్రమం, రాకేష్ బాలల ఆశ్రమాలకు 140 బస్తాల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ, ఎన్ని ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థలు వచ్చినా ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసి అంటేనే ప్రజలకు నమ్మకమని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందిస్తోన్న సంస్థ ఎల్ఐసి అని ఆయన కొనియాడారు. నేటి రోజుల్లో ప్రతి ఒక్క కుటుంబానికి బీమా ఎంతో అవసరమన్నారు. ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జె.సుందరరాజన్ మాట్లాడుతూ, ఎల్ఐసి రెండవ విభాగంలో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఎల్ఐసి డివిజన్లలో నెల్లూరు డివిజన్ ప్రథమస్థానం సాధించిందన్నారు. అందుకోసం కృషిచేసిన ఏజెంట్లు, పాలసీదారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం, పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆదర్శపాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, అధికారులు ఆర్.వెంకట్రావు, జగదీశ్వర్‌తో పాటు పలు బ్రాంచ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంకా
# సెగలు.. పొగలే...

నెల్లూరు వాళ్ళకు మార్చి నెలలో మొదలైంది ఎండాకాలం. ఇప్పుడు సెప్టెంబర్ నెల. దాదాపు 7 నెలలుగా నెల్లూరీయులు ఎండల్లోనే మగ్గిపోతున్నారు. దేశమంతటా వర్షాలు, కేరళ వంటి చోట్ల వరదలు వచ్చి జనం కొట్టుకుపోతున్నా... నెల్లూరుతో మాత్రం వరుణ దేవుడు దొంగాట ఆడుతున్నాడు. సెప్టెంబర్ నెలలో కూడా ఎండలు అదరకొస్తున్నాయి. మే, జూన్ నెలల్లో అంటే ఎండలు మండిపోవడం సాధారణం కాబట్టి జనం పెద్దగా ఇబ్బందిపడరు. ఎందుకంటే ఎండలను ఎదుర్కోవడానికి సిద్ధపడి వుంటారు. కాని సెప్టెంబర్ నెలలో కూడా సెగలు తగ్గక పోగా, రోజురోజుకు ఎండ మిడిమేళంగా ఉంటుంది. ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. ఏరోజుకారోజు ఈరోజన్నా వర్షం పడకపోతుందా అని జనం ఆశగా ఆకాశంవైపు చూస్తున్నారు.

# ఎస్పీడీసీయల్‌కు
# రెండు అవార్డులు

జాతీయస్థాయిలో ఎస్పీడీసీయల్‌కు రెండు అవార్డులు లభించాయి. కేంద్ర వ్యాపార, పరిశ్రమల, విమానయాన మంత్రి సురేష్ ప్రభు చేతులమీదుగా చీఫ్ ఇంజనీర్ నందకుమార్ ఈనెల 8న ఢిల్లీలో ఈ అవార్డులందుకున్నారు. ఎస్పీడీసీయల్ చేపట్టిన పర్యావరణహిత ఇంధన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం, అసాధారణ పర్యావరణ హిత ప్రాజెక్ట్‌కు ద్వితీయస్థానం రావడంతో ఈ అవార్డులు లభించాయి. అవార్డులు రావడానికి కారణమైన సీఎండీ ఎంఎం నాయక్‌కు విద్యుత్ సిబ్బంది, ఉద్యోగులు అభినందనలను తెలియజేశారు.

## సమాచారశాఖ
# ఇన్‌ఛార్జి డి.డిగా రమాదేవి

జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఇన్‌ఛార్జి డెప్యూటీ డైరెక్టర్‌గా సరళాదేవి నియమితులయ్యారు. ఇప్పటిదాకా డిడిగా పనిచేస్తున్న షేక్ లాల్‌జాన్ పదోన్నతిపై కడప ఆర్జేడీగా బదిలీ కావడంతో, ప్రస్తుతం డిపిఆర్ఓగా పనిచేస్తున్న సరళాదేవికి ఈ బాధ్యతలు అప్పగించారు. ఈనెల 7న డిపిఆర్ఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిపిఆర్ఓ సరళాదేవి, ఏపిఆర్ఓ రవికుమార్, ఉద్యోగులు, సిబ్బంది అందరూ పదోన్నతి పొందిన లాల్‌జాన్ సేవలను కొనియాడుతూ ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. లాల్‌జాన్ మాట్లాడుతూ అందరి సహకారంతో తాను జిల్లాకు ఉత్తమసేవలు అందించగలిగానని, ఉద్యోగులు, సిబ్బంది అందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు.

# హాస్యచక్రవర్తి.. నేటి తారలకు స్ఫూర్తి...

# టి.వి.రమణారెడ్డి



## • పృధ్వీరాజ్‌కు ఘనంగా అవార్డు ప్రదానం

"అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే... అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే"... తరాలెన్ని మారినా, బ్లాక్ అండ్ వైట్ వెళ్ళి కలర్ వచ్చినా, రీళ్ళు పోయి డిజిటల్ వచ్చినా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఏరోజైనా తాజాగా అనిపించే అద్భుతమైన పాట. ఈ పాట వింటే గుర్తొచ్చే మహానటుడు, మన నెల్లూరీయుడు తిక్కవరపు వెంకట రమణారెడ్డి, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఆయనదో ప్రత్యేక స్థానం. హాస్యానికి ప్రాణం పోస్తే వచ్చే ప్రతిబింబమే రమణారెడ్డి. అలాంటి గొప్ప హాస్యనటుడి పేర అవార్డును నెలకొల్పి ఆ అవార్డును లేటెస్ట్ ట్రెండ్‌ను ఫాలో అవుతూ తన కామెడీతో నవ్వుల పువ్వులు పండిస్తున్న మరో హాస్యనటుడికి ప్రదానం చేసిన కార్యక్రమానికి ఈ నెల 9వ తేదీన నెల్లూరు పురమందిరం వేదికగా నిలిచింది.



సభకు విచ్చేసిన కళాభిమానులు



నృత్య విన్యాసాలతో అలరించిన చిన్నారులు

కళాంజలి కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టి.వి.రమణారెడ్డి స్మారక అవార్డును ప్రముఖ హాస్యనటుడు, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా తెలుగుతెరపై వెలుగుతున్న కామెడీ కింగ్ పృధ్వీరాజ్‌కు ప్రదానం చేసారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరి, కళాంజలి అనంత్‌లు పృధ్వీరాజ్‌ను గజమాల, శాలువ, జ్ఞాపిక, కిరీటధారణతో సత్కరించి, వేద పండితుల ఆశీస్సులందజేశారు.

సభా కార్యక్రమానికి ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో బాగా ఆకట్టుకున్నాయి. 'అయ్యయో చేతిలో డబ్బులు పోయెనే..' అనే రమణారెడ్డి పాటకు విజయ్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యం ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా కళాకారుడు, కళాభిమాని సూరిశెట్టి వెంకటేశ్వరరావుని, ఆడిటర్ కృష్ణమోహన్‌ని "కళాంజలి అవార్డు"లతో సత్కరించారు. కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో శైలజ, అరుణ్‌కుమార్‌లు వాఖ్యాతలుగా వ్యవహరించారు.

### ఇది నా అదృష్టం



- పృధ్వీరాజ్

టి.వి.రమణారెడ్డి పేరుతో నెలకొల్పిన తొలి అవార్డు తనకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశాడు పృధ్వీరాజ్. ఇది తన అదృష్టంగా భావిస్తున్నానన్నాడు. నెల్లూరు ఎంతో చారిత్రాత్మక పట్టణమని, ఈ నెల్లూరంటే తనకెంతో ఇష్టమని చెప్పాడు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్‌లు ఫైర్‌బ్రాండ్‌లని, ప్రజల తరపున వారు చేస్తున్న పోరాటాలు తనకెంతో స్ఫూర్తిదాయకంగా వుంటాయని చెప్పాడు. తాను నటించిన సినిమాలలో కొన్ని డైలాగ్‌లను వినిపించి ప్రేక్షకులను అలరించాడు.

### సినిమాలు నాకు వ్యసనం



- కోటంరెడ్డి

నాకు ఎన్టీఆర్ అంటే పిచ్చి అభిమానం. ఆయనకు ఇదే టౌన్‌హాల్‌లో వేలుకోసుకుని రక్తం బొట్టు పెట్టాను. నాకున్న వ్యసనమల్లా సినిమాలు చూడడం. అది కూడా తెలుగు సినిమాలే! ఇంగ్లీష్, హిందీ సినిమాలు నాకు అర్థం కావు కాబట్టి చూడను. విడుదలైన వాటిలో 90శాతం సినిమాలు చూస్తుంటాను. ఈ కార్యక్రమంలో నాకిష్ట మైన మూడు పాటలను వినిపించినందుకు కళాంజలి అనంత్‌కు కృతజ్ఞతలు. అనంత్ నా క్లాస్‌మేట్! విద్యార్థి దశ నుండే కళలకు ప్రాణమిచ్చేవాడు. ఇక అవార్డు గ్రహీత పృధ్వీరాజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే! వైసిపి పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యేలు కొందరు తెలుగుదేశంకు అమ్ముడుపోతే, సినిమా యాక్టర్లు సైతం అధికారపార్టీకి దాసోహమంటుంటే, జగన్ అనే ప్రతిపక్ష నాయకుడి వెంట నడిచిన వ్యక్తి పృధ్వీరాజ్. ఆయనలో అభిమానం చూసామే తప్ప స్వార్థం చూడలేదు. అందుకే ఆయనంటే మాకు ఎంతో అభిమానం. ప్రతి రంగంలోనూ ఉత్తమ అవార్డులిచ్చినట్లే రాజకీయ రంగంలోనూ ఉత్తమ నాయకుల అవార్డులు ప్రవేశ పెడితే మాకూ కొంత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

### జగనన్నకు తోడుగా నిలిచాడు



- అనిల్

ఈరోజు నాకు ఆరోగ్యం బాగాలేకపోయినా ఈ సభకు రావడానికి ఒక కారణం కళాంజలి అనంత్ అయితే, రెండో కారణం పృధ్వీరాజ్. ఆయన నెల్లూరుకు వస్తే స్వాగతించడం మా బాధ్యత. కష్టకాలంలో కూడా జగనన్నకు తోడుగా నిలిచిన, నడిచిన వ్యక్తి పృధ్వీరాజ్. భవిష్యత్‌లో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను అని చెబుతూ అనిల్ ఈ సందర్భంగా చంద్రబాబు – దోమలపై చెప్పిన జోక్ ప్రేక్షకులను నవ్వించింది.

### రమణారెడ్డి విగ్రహం పెట్టాలి



- ప్రభు

టి.వి.రమణారెడ్డి 1951లో చిత్రరంగంలో ప్రవేశించారు. తాతగా, మామగా, తండ్రిగా ఎన్నో పాత్రలు పోషించారు. కాని ఆయన 53ఏళ్లలోనే ఈ లోకాన్ని వీడారు! ఆయన నటుడే కాదు. గొప్ప మెజీషియన్ కూడా! ఇదే టౌన్ హాల్‌లో ఎన్నో ఇంద్రజాల ప్రదర్శనలిచ్చి సభికులను మైమరపించారు. అలాంటి గొప్ప నటుడి పేరుతో నెలకొల్పిన తొలి అవార్డును నేటితరంలో మరో గొప్ప హాస్యనటుడికి అందజేయడం అభినందనీయం. రమణారెడ్డి నటించే చిత్రం పౌరాణికమైనా, జానపదమైనా, సాంఘికమైనా ఆయన భాష, యాస ఒకేలా వుండేది. అదే తరహాలో పృధ్వీరాజ్ తనకు లభించిన ఏ పాత్రలోనైనా తన ఉచ్చారణ మాత్రం మార్చుకోవడం లేదు. ఇది వీరిద్దరికీ వున్న దగ్గర పోలిక. రమణారెడ్డి 30యేళ్ళ ప్రాయంలో ఇండస్ట్రీలో అడుగుపెడితే పృధ్వీ థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా ప్రాచుర్యం పొందాడు. నెల్లూరులో రమణారెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తే తాను ఆర్థికసాయం చేస్తానని కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆయన విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యేలు చొరవచూపాలి. 2002లో 'లాయర్' ఆధ్వర్యంలో కస్తూరిదేవి స్కూల్ మైదానంలో నిర్వహించిన 'నవ్వుల పండుగ' వేదికకు రమణారెడ్డి వేదిక అని పేరు పెట్టాం! 'లాయర్' వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారికి సాంస్కృతిక, సాహిత్య, రాజకీయ రంగాలతో అనుబంధముండేది. అందుకే గతంలో ప్రతిఏటా సాంస్కృతిక, సాహిత్య రంగాల వారికే కాక ప్రజాసేవలో రాణించిన రాజకీయ నాయకులకు కూడా తుంగా అవార్డులిచ్చాము. 2006లో వై.యస్.రాజశేఖరరెడ్డికి తుంగా అవార్డునందజేయడం జరిగింది. వచ్చే ఏడాది నుండి కళాంజలి సంస్థ తరపున ఉత్తమ రాజకీయ నాయకులను కూడా ఎంపిక చేసి అవార్డులివ్వాలని కోరుతున్నాను.

### అభినందనీయం కళాంజలి ప్రయత్నం



- హజరత్‌బాబు

నవ్వులరాజు రమణారెడ్డి గారి పేర 'అవార్డు' ఏర్పాటు చేసి ప్రతియేటా ఇవ్వాలని సంకల్పించడం హర్షణీయం. కళాంజలి నిర్వాహకుడు అనంత్‌ని నేను అభినందిస్తున్నాను. చరిత్ర మరువలేని నటుడు రమణారెడ్డి. ఆయన విగ్రహాన్ని కళాక్షేత్రంలో నెలకొల్పాలని సంకల్పించాం. అనివార్యకారణాల వల్ల కుదరలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు చొరవచూపి ఆయన విగ్రహం ద్వారా భావితరాలకు స్ఫూర్తినింపాలి.

# రాజకీయాలకే కళంకం కాకాణి

## – సోమిరెడ్డి ఫైర్

పుచ్చలపల్లి సుందరయ్య, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి లాంటి గొప్ప వ్యక్తులు పుట్టిన నెల్లూరుజిల్లాలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి లాంటి ఎమ్మెల్యే కూడా వుండడం రాజకీయాలకే కళంకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 8వ తేదీన ఆయన 'గ్రామదర్శిని – గ్రామవికాసం'లో భాగంగా పొదలకూరు మండలం మొగళ్ళూరులో పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసారు. అక్కడ పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ప్రజా సమస్యలు పట్టవని, ఆయన ధ్యాసంతా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం, తప్పుడు ఆరోపణలు చేయడం పైనే వుంటుందన్నారు. ఈ పొదలకూరు మండలమే కాకాణికి రాజకీయ భిక్ష పెట్టింది. జడ్పీ ఛైర్మెన్ అయ్యాడు. ఎమ్మెల్యే అయ్యాడు. కానీ ఈ పొదలకూరు మండలం కోసం ఆయన ఒక్క పనీ చేయలేదు. కండ్లేరు లిఫ్ట్ కెనాల్ కోసం టెండర్లు పిలిపించాలని ఆయన ఒక్కరోజు కూడా జడ్పీ మీటింగ్‌లో అడిగింది లేదు... అసెంబ్లీలో ప్రశ్నించింది లేదు. కాని దుర్మార్గపు బాషతో మమ్మల్ని తిట్టడమే పనిగా



మొగళ్ళూరులో ప్రాథమిక పాఠశాల చిన్నారులతో ముచ్చటిస్తున్న మంత్రి సోమిరెడ్డి

పెట్టుకున్నాడు. అయినా రాజకీయంగా పైకి తీసుకొచ్చిన ఆనం కుటుంబాన్నే నీచాతి నీచంగా తిట్టిన కాకాణికి నన్ను తిట్టడం పెద్ద లెక్కకాదని ఆయన పేర్కొన్నాడు.



## జయంపుకృష్ణ పుస్తకాలను ఆవిష్కరించిన
# యం.యస్.రెడ్డి కుటుంబసభ్యులు



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, సినీ రచయిత జయంపుకృష్ణ వ్రాసిన రెండు పుస్తకాలను ఇటీవల సహజకవి స్వర్గీయ డాక్టర్ యం.యస్.రెడ్డి కుటుంబసభ్యులు ఆవిష్కరించారు. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని మల్లెమాల నివాసంలో జయంపు వ్రాసిన 'కృష్ణధ్వని' అనే కవితా సంపుటిని డాక్టర్ యం.యస్.రెడ్డికి అంకితమిచ్చారు. ఈ పుస్తకాన్ని యం.యస్.రెడ్డి సతీమణి శ్రీమతి సౌభాగ్యమ్మ ఆవిష్కరించారు.

అలాగే జయంపు వ్రాసిన 'మిర్చీ బజ్జీ' అనే ఆధునిక శతకంను హైదరాబాద్‌లోని శబ్దాలయ స్టూడియోలో డాక్టర్ యం.యస్.రెడ్డి కుమారుడు శ్యాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీరియల్ దర్శకులు అనిల్‌కుమార్, స్క్రీన్ ప్లే రచయిత కొమ్మినపల్లి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమ్మెపై మంత్రి స్పందించాలి

## - ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరపాలకసంస్థ పారిశుద్ధ్య కార్మికులు గత 25 రోజుల నుంచి సమ్మె చేస్తుండడంతో నగరమంతా చెత్తతో నిండిపోయిందని, ఈనెల 8న జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో కార్మికుల సమస్యల పరిష్కారం ఒక కొలిక్కిరాక పోవడం బాధాకరమని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. అనిల్‌కుమార్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 9న ఆయన నెల్లూరులోని అరుణాచలంవీధి, లక్ష్మీపురం ప్రాంతాల్లో ప్రజాదీవెన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జి.ఓ నంబరు 279ని రద్దు చేయాలన్నారు. లేదా వినాయకచవితి పండుగ దృష్ట్యా ఆ జిఓను తాత్కాలికంగా నైనా రద్దు చేసి కార్మికులచేత సమ్మె విరమింపజేసి నగరంలోని చెత్తను తొల గించి నగరాన్ని పరిశుభ్రం చేయించాల్సిన బాధ్యత మంత్రి నారాయణపై ఉందన్నారు.



ఇప్పటికే తాము అనేకమార్లు చెప్పామని, ఇప్పటికైనా కార్మికుల సమ్మెపై తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. 25 రోజుల నుంచి ఎక్కడి చెత్త అక్కడే ఉందని, వర్షాలు రాకపోవడం మన అదృష్టమని, లేదంటా ఈ చెత్తాచెదారమంతా తడిసి ప్రజలకు నానా రోగాలు వచ్చేవని అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు వర్షాలు కురవవని, తాగేందుకు నీరు వుండదని, రాష్ట్రం కరువుకాటకాల్లో ఉంటుందని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు.

# ఎన్‌బికెఆర్‌లో రక్తదాన శిబిరం

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని కళాశాల సంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ అన్ని దానాల్లోకన్నా రక్తదానం గొప్పదని, ప్రతిఒక్కరూ రక్త దానాన్ని ప్రోత్సహించాలని, ఒకరి రక్త దానం మరొకరి ప్రాణాన్ని కాపాడుతుందని చెప్పారు. ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ఆయన అభినందిస్తూ.. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలకు కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు. గత యేడాది ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద అత్యధికంగా రక్తం యూనిట్లు దానం చేసినందుకు గాను కళాశాలకు గవర్నర్ అవార్డు కూడా లభించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ జి.మాధవయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

జిల్లా సబ్‌జూనియర్ కబడ్డీ బాల బాలికల జట్టు ఎంపికలు నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 7న జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి చిత్తూరుజిల్లా పుంగనూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కబ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లవకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి విజయకుమార్, సతీష్‌బాబు, సురేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## కోర్టుల చుట్టూ తిరిగి..
# కాలం వృధా చేసుకోవద్దు



కాలం ఎంతో విలువైందని, క్షణికావేశంలో చేసిన చిన్న తప్పుల వల్ల జీవితాన్ని భారం చేసుకోవద్దని, రాజీమార్గం ద్వారా ప్రతిఒక్కరు తమ కేసులను పరిష్కరించుకోవచ్చని 7వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శాంతి అన్నారు. గూడూరు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా జాతీయ లోక్అదాలత్‌ను ఈ నెల 8న నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జిలు మాట్లాడుతూ తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేయడం దారుణమని, నిరాదరణకు గురైన తల్లిదండ్రులు చట్టం ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు. వివాదాల కారణంగా కోర్టులు చుట్టూ తిరిగి కాలం వృధా చేసుకోకుండా ఉండేందుకు పరస్పరం కక్షిదారులు రాజీమార్గంలో ముందుకు సాగితే అందరికీ బాగుంటుందన్నారు. కోర్టుల్లో ఏళ్ళ తరబడి చాలా కేసులు వాయిదాలో ఉండడంతో కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాజీమార్గమే రాజమార్గమని ప్రతిఒక్కరు మనస్పర్ధలు లేకుండా కలసి చర్చించుకుంటే సమయం మిగలడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ఎస్.రామకృష్ణారావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.జయలక్ష్మి, అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ లావణ్య, డిఎస్పీ రాంబాబు, పట్టణ సిఐ కళ్యాణరాజు, లోక్అదాలత్ మెంబర్లు హరినాథ్, ప్రసాదరావు, అరవ పార్వతయ్య, ఎస్సైలు బాబీ, హుస్సేన్ బాషా, శేఖర్‌బాబు, శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు రోటరీ ఫలసరుకులు



ఫలసరుకులు పంపిణీ చేస్తున్న డిస్కం డి.ఇ అనిల్‌కుమార్, రోటరీ ప్రతినిధులు

ప్రతి నెలా వృద్ధులకు రోటరీ హెల్పేజ్ ద్వారా ఫలసరుకులు అందజేయడం అభినందనీయమని డిస్కం డి.ఇ అనిల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవనంలో రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫలసరుకులను ఈనెల 10వ తేదీన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఉన్న పెద్దలను గౌరవించడం మన బాధ్యత అని, అది మన సంప్రదాయమని అన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.మునిగిరీష్, అధ్యక్షుడు హరిప్రసాద్, రోటరీ ప్రతినిధులు కె.సుందరరామిరెడ్డి, దశరధరామిరెడ్డి, మల్లయ్య, కె.సురేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు జేవివి భోజనప్యాకెట్లు



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న జేవివి ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల ప్రాంగణంలో గర్భిణులకు జేవివి ఆధ్వర్యంలో, వెంకటేశ్వర్లు దాతృత్వంతో భోజనప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ నెల 10న జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ, గర్భిణులకు ప్రతినెలా మంచి ఆహారం అందజేయడం అభినందనీయమన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు, పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, రామ్మోహన్‌రావు, శ్రీధర్, కౌన్సిలర్ చాలి బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొండూరు దంపతులకు సన్మానం

ఈ నెలలో రిటైరవుతున్న వేములపాళెం హెడ్‌మాస్టర్ కొండూరు రామరాజు దంపతులను గురుపూజోత్సవం రోజున గూడూరు ఎంఇఓ ఆఫీసులో సత్కరిస్తున్న ఎంపిడిఓ అన్నపూర్ణరావు, ఎంఇఓ వి.సూర్యనారాయణ, ఎంపిపి పిట్టి రావమ్మ, ఉపాధ్యక్షురాలు ఎం.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



# స్వర్గంలో స్పృహ తప్పిన ఎన్టీఆర్

గల్పిక

అది దేవేంద్ర లోక రాజధాని అమరావతి నగరం. భూ లోకం నుండి స్వర్గానికి విచ్చేసిన నందమూరి హరి కృష్ణకు స్వాగతం పలుకుతూ ఇంద్ర కన్వెన్షన్ సెంటర్‌లో కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు. దేవేంద్రుడితో పాటు నారదమహర్షి కూడా ఆ వేడుకలకు విచ్చేసారు. మొదట నందమూరి తారక రామారావుతో సాంస్కృతిక కార్యక్రమాలు మొదలు పెట్టారు. 'వేటగాడు' సినిమాలో 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరి హరి... కోకెత్తుకెళ్లింది కొండగాలి' అనే పాటకు రంభతో కలిసి ఎన్టీఆర్ డ్యాన్స్ చేసాడు. తర్వాత అక్కినేని నాగేశ్వరరావు వంతు వచ్చింది. ఆయన శ్రీదేవితో కలిసి 'ప్రేమాభిషేకం' సినిమాలోని 'దేవీ మౌనమా శ్రీదేవి మౌనమా... నీకై తపించు జపించు భక్తునిపై మౌనమా' అనే పాటకు డ్యాన్స్ చేసి అలరించాడు. వెంటనే ఎస్వీ రంగారావు లేచాడు... గదను భుజాలపై పెట్టుకుని 'వివాహ భోజనంబు... వింతైన వంటకంబు... వియ్యాలవారి విందు... అహహహా నాకె ముందు' అనే పాటకు అభినయించాడు. సరిగ్గా అప్పుడు లేచాడు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66)... ఏహే ఆపండహే... మీ పాత చింతకాయ పాటలు మీరూనూ... మీరింకా అప్‌డేట్ కావాలి... "ఓ అప్పారావు, ఓ సుబ్బా రావు, ఓ వెంకట్రావు, ఓ రంగారావు ఎవరో ఎవరో ఎవరో వస్తారనుకుంటే నువ్వొచ్చావా" అనే పాటల కాలం పోయింది అని.. రేయ్... మంచి ఫాస్ట్ బీట్ పెట్టండ్రా అంటూ అరిచాడు. ఆయన చెప్పినట్లే 'రంగస్థలం' సినిమా లోని "రంగమ్మా మంగమ్మా" అనే పాట పెట్టగా వివేకా రంభ, ఊర్వశి, మేనకల నడుములు గిరగిరా తిప్పుతూ డ్యాన్స్ ఇరగదీసాడు.

సాంస్కృతిక కార్యక్రమాలు అయి పోయాక అందరూ భోజనాలకు లేచారు. భోజనాలు చేస్తున్న సమయంలో హరికృష్ణ వద్దకు ఎన్టీఆర్ వచ్చాడు. గట్టిగా కౌగి లించుకుని నాకిక్కడ చైతన్యరథం తోల డానికి సరైన డ్రైవర్ లేడని నా కోసం నువ్వొచ్చావా నాయనా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. నాకు ఎన్ని జన్మల అవకాశం వుంటే అన్ని జన్మల్లోనూ మీ బిడ్డగా కాకపోయినా మీ రథంతోలే డ్రైవర్‌గా అవకాశమివ్వమని ఆ భగవం తుని కోరుకుంటాను తండ్రి గారు అని హరికృష్ణ చెప్పాడు. హరికృష్ణ ప్రేమకు ఎన్టీఆర్ మరింతగా చలించిపోయాడు. అంతలో నారద మహర్షి, వివేకా అక్కడకు వచ్చారు. హరికృష్ణతో నారదుడు... నాయనా, భూలోకమున అందరూ కుశలమేనా? అని ప్రశ్నించాడు. అందరూ బాగానే వున్నారని హరికృష్ణ చెప్పాడు. ఇంతకీ తెలుగు ప్రజలు ఎలా వున్నారని నారదుడు అడిగాడు. ఆయన ప్రశ్నలకు హరికృష్ణకు మనసులో ఏదో సందేహం కలగసాగింది. ఈ అగ్గిపుల్ల స్వామి నన్నే గుచ్చి గుచ్చి అడుగుతున్నాడంటే ఏదో మంట పెట్టడానికే లాగుందనుకుంటూ తెలుగు ప్రజలు బాగానే వున్నారు స్వామి అని చెప్పాడు. మీ నాన్న గారు అమలు చేసిన మద్యపాన నిషేధ చట్టం తెలుగు రాష్ట్రాలలో ఇంకా అమలులోనే వుందా? ప్రజలు మద్యానికి దూరంగా సుఖశాంతు లతో బ్రతుకుతున్నారా? అని నారదుడు ప్రశ్నించాడు. అక్కడ ఎన్టీఆర్ కలుగ జేసుకుని... ఏం మాట్లాడుతున్నావు నారదా, నా అల్లుడు చంద్రబాబు నాకు వెన్నుపోటు పొడిచి వుండొచ్చు, నా ఆశయాలకు కాదు. మద్యపాన నిషేధం మా తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం... ప్రజలకు మేమిచ్చిన వాగ్దానం. దానిని మా అల్లుడు గారు పాటించాల్సిందే! అదీగాక మా అల్లుడికి మద్యపాన వ్యసనం లేదు. అలాగే సిగరెట్, గుట్కా, మట్కా, ఖైనీ, కిళ్లీ, పాన్‌మసాల, పేకాట, ఇతర జూదాలేవీ అలవాటు లేవు అని చెప్పాడు. అందుకు నారదుడు... ఏమయ్యా హరికృష్ణ మీ తండ్రి గారు చెప్పిందంతా నిజమేనా? మద్యపాన నిషేధం అంత చక్కగా అమలు చేస్తున్నారా మీ బావగారు అని అడిగాడు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్ప లేక హరికృష్ణ నీళ్లు నమలసాగాడు. నారదుడు ఆయనకు ఇంకో ప్రశ్న సంధిస్తూ... ఇంతకీ మీ తెలుగుదేశం పార్టీ ఎలా వున్నది? తెలుగువారి ఆత్మ గౌరవం నుండి పుట్టిన పార్టీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మీ నాన్నగారు స్థాపించిన పార్టీ... అదే పోరాట పంథాలో పయ నిస్తుందా? అని అడిగాడు. హరికృష్ణ మనసులో... పెట్రా నారదుడు నిప్పు... ఇప్పుడు అబద్ధం చెబితే తండ్రినే మోసగించిన తనయుడినవుతాను, అలా గని నిజం చెబితే ఆయన తట్టుకోలేడు... ఆయన గుండె మరోసారి బద్దలవుతుంది. ఇక్కడ సమయానికి ఆసుపత్రికి తీసు కెళ్లడానికి 108 అంబులెన్స్‌లు కూడా వుండి చావవు అనుకుంటుండగా... అప్పుడు వివేకా కలుగజేసుకున్నాడు. నారదా, ఇన్ని ప్రశ్నలెందుకు? మీ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి మీ దగ్గర ఎన్నో మాయోపాయాలున్నాయి కదా! మంత్ర శక్తితో ఏం జరుగుతుందో మీరే ప్రత్యక్షంగా చూడండి, మా పెద్దా యన ఎన్టీఆర్‌కు చూపించండి అని సలహా ఇచ్చాడు. అటులనే అంటూ నారదుడు 'ఓం హ్రీం ఏపి డాట్‌కామాయనమః' అని మంత్రం చదివాడు. వెంటనే అక్కడ పెద్ద స్క్రీన్ ప్రత్యక్షమైంది. నారదుడు మళ్లీ ధూమ్ ధూమ్ సీన్ స్క్రీనాయనమః అని మంత్రం చదివాడు. స్క్రీన్ మీద సీన్‌లు ప్రసారం కాసాగాయి.

★★★★★

అది నెల్లూరుజిల్లాలోని ఓ మారు మూల పల్లెటూరు. మిట్ట మధ్యాహ్నం... ఒకావిడ బిందె పట్టుకుని బావి వద్ద కెళ్లింది. దాంట్లో నీళ్ల లేవు... తర్వాత వూరి మధ్యలో వుండే బోరు వద్దకొచ్చి పంప్ కొట్టింది. చుక్క నీళ్లు రాలేదు. దాదాపు మూడు మైళ్ల నడిచి వెళ్లి పొలాల్లోని మోటారు వద్ద నీళ్లు పట్టుకుని వచ్చింది. అదే సమయంలో గ్రామం మధ్యలోని ఓ షాపు వద్ద పెద్ద గుంపుగా మగాళ్లున్నారు. అందరి చేతుల్లోనూ బ్రాందీ, విస్కీ, బీరు సీసాలు, వాటర్ బాటిళ్లు వున్నాయి. అందరూ తప్పతాగి తూలుతున్నారు. ఆ సీన్‌లు చూసి ఎన్టీఆర్ బిత్తరపోయాడు. ఏంటి వివేకా... ఇదంతా ఏంటి అని ఎన్టీఆర్ అడిగాడు. దానికి వివేకా... ఇది ఒక్క శాంపిలే సార్, రాష్ట్రంలోని ప్రతి పల్లెటూర్లో ఇలాంటి సీన్‌లు నిత్యకృత్యం... ఒక్క మాటలో చెప్పాలంటే పల్లెల్లో వీళ్లంతా మందు కొడితేనే ఏపిలో ప్రభుత్వం నడుస్తుంది అని చెప్పాడు. ఆ సీన్‌కే ఎన్టీఆర్ మనసు బాధతో మెలికలు తిరగసాగింది. ఆ తర్వాత ఇసుక దోపిడీ, అమరావతి నిర్మాణాలు, పంట పొలా లను దున్నేయడం, అధికారులను ఎమ్మె ల్యేలు కొట్టడం వంటి సీన్‌లు చూసి ఆయన మనసు ఇంకా చలించిపోయింది. ఆ తర్వాత అసెంబ్లీలో 126మంది ఎమ్మెల్యేలు పసుపు కండువాలు వేసుకున్న సీన్‌ను చూసి ఎన్టీఆర్... అదేంటి వివేకా... 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు 103 మందే కదా... మరి 126మందిపై పసుపు కండువాలున్నాయేంటి అని అడిగాడు. అప్పుడు హరికృష్ణ కలుగజేసుకుని... నాన్నగారు, మీరు అంతలోతుగా వెళ్లొద్దు, అవన్నీ తెలుసుకుని మీరు తట్టుకోలేరు, మీ కాలం రాజకీయాలు వేరు, ఈ కాలం రాజకీయాలు వేరు అని సర్ది చెప్పబోతుం డగా ఎన్టీఆర్ ఆవేశంగా... హరి నువ్వు ఆపు... వివేకా నువ్వు చెప్పు అని గద్దిం చాడు. అప్పుడు వివేకా... సార్, మీ పార్టీ తరపున గెలిచింది 103 మందే... వైసిపి నుండి కొన్న 23మందితో కలిసి 126మంది అయ్యారు. ఇప్పుడు ఇండి యన్ పొలిటికల్ మార్కెట్‌లో ఎంపీలకు, ఎమ్మెల్యేలకు మంచి డిమాండ్ వుంది సార్ అని చెప్పాడు. ఎన్టీఆర్ రెండు చెవులు మూసుకుని హత విధీ... రాజకీయాలు ఇంత దిగజారిపోయాయా అని దిగులుపడ్డాడు. ఈ సీన్‌కే ఇలా అయ్యావు... ఇక అసలు సీన్ చూస్తే ఏమైపోతావో అని వివేకా గొణిగాడు. అది ఎన్టీఆర్ చెవికి వినపడడంతో ఏంటా అసలు సీన్ అని అడిగాడు. ఇదిగో చూడండి వస్తుంది అంటూ వివేకా స్క్రీన్‌వైపు చూపించాడు.

హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసమది. ఆ ఇంట్లోకి కాంగ్రెస్ నాయ కులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గీతారెడ్డి, రేవంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జానారెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డిలు వెళ్తున్నారు. ఆ సీన్ చూసి ఎన్టీఆర్... ఈరోజు బాబు ఇంట్లో ఏదన్నా ఫంక్షన్ వుందా అని అడిగాడు. లేదు అని హరికృష్ణ చెప్పాడు. మరి ఈ కాంగ్రెస్ నేతలంతా ఎందుకు వెళుతున్నట్లు అని ఎన్టీఆర్ ప్రశ్నించాడు. తినబోతూ రుచి అడగడమెందుకు, మీరే చూడండి అని వివేకా అన్నాడు. బాబు ఇంట్లోని ఓ హాల్‌లో అందరూ కూర్చున్నారు. చంద్ర బాబు వుండి... మాకు పాతిక అసెంబ్లీ, 5 లోక్‌సభ ఇవ్వండి అని అడిగాడు. అందుకు ఉత్తమ్... మీకు అవి చాలా ఎక్కువ, 15అసెంబ్లీ, 2 లోక్‌సభ ఇస్తాం తీసుకోండి అని చెప్పాడు. అట్లాకాదు... ఒక్కో అసెంబ్లీ రేటెంతో చెప్పండి... కొన్నింటిని కొనుక్కుంటానని చంద్రబాబు ఆఫర్ ప్రకటించాడు. ఇదంతా స్క్రీన్‌పై చూస్తున్న ఎన్టీఆర్... ఏం జరుగుతుం దక్కడ అని అడిగాడు. దానికి వివేకా... ఇంకా అర్థం కాలేదా సార్... తెలుగు దేశం - కాంగ్రెస్‌ల మధ్య ఎన్నికల పొత్తు చర్చలు జరుగుతున్నాయి అని చెప్పాడు. ఆ మాట వినడంతోటే ఎన్టీఆర్... నేను స్థాపించిన పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడమా... ఇంత దుర్మార్గమా అంటూ ఆవేశంగా లేచాడు. ఆ ఆవేశం లోనే పడిపోయాడు... హరికృష్ణ అల్లా పెద్దగా 'అంబులెన్స్' అంటూ అరిచాడు.

(ఇంకా వుంది...)

## గురునిలయంలో...
## 15న వెంకయ్యస్వామి ఆరాధన



నెల్లూరు మూలాపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న గురునిలయంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి భక్తుడైన మాకాని వెంకట్రావు స్వామి కుటుంబసభ్యులు, భక్త బృందం ఆధ్వర్యంలో ఈనెల 15న శ్రీ వెంకయ్యస్వామివారి 36వ ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. స్వామివారి సేవలో పునీతమైన బ్రహ్మశ్రీ శ్రీ నారా యణదాసుస్వామివారు(తలుపూరు), అవధూత దేగపూడి కాంతమ్మతల్లి ప్రధమ శిష్యుడు సుబ్బారెడ్డి, గాలిపాళెం శ్రీహరి స్వామి తదితర ముఖ్యులు పాల్గొంటారని, ఈ నెల 14న ఉదయం 8గంటల నుంచి శ్రీ స్వామివారి నామసంకీర్తనతో భిక్షాటన కార్యక్రమం, ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు భజన ఉంటుందని తెలిపారు. 15న ఉదయం 6 గంటలకు శ్రీ స్వామి వారికి, శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావుస్వామికి అభిషేకం, పూజలు, 9 గంటలకు గురుదేవుల భక్తబృందంచే భజన సంకీర్తన, 11గంటలకు అన్నదానం, సాయంత్రం 6గంటలకు అఖండ నామ సంకీర్తన, 7 గంటలకు నగరోత్సవం నిర్వ హిస్తామన్నారు. భక్తులందరూ పాల్గొని శ్రీ వెంకయ్యస్వామి వారి అనుగ్రహం పొందా లని వారు విజ్ఞప్తి చేశారు.

## ఒక్క నిమిషం కూడా కరెంట్ పోకూడదు

- ఎస్.ఇ విజయకుమార్‌రెడ్డి హెచ్చరిక

నెల్లూరు నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలకు 60 నిమిషాల నుంచి 90 నిమిషాల కంటే అదనంగా ఒక్క నిమిషం కూడా ఎక్కువగా విద్యుత్ అంతరాయం ఉండ కూడదని, ఒకవేళ అలా జరిగితే సంబంధిత ఏఇలపై చర్యలు తప్పవని ఏపి ఎస్‌పిడిసిఎల్ ఎస్.ఇ విజయకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో ఈ నెల 7న నిర్వహించిన విద్యుత్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంతరాయం లేని విద్యుత్‌ను అందించడమే ధ్యేయంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. కాలిపోయిన, లేదా చెడిపోయిన విద్యుత్ మీటర్ల స్థానంలో వెంటనే కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోఓల్టేజీ ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట్ల 160కేవీ, 300కేవీ ట్రాన్స్‌ఫార్మాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఇ రమేష్‌చౌదరి, ఏఇ రమేష్ పాల్గొన్నారు.

## రాజీమార్గం ద్వారా శాశ్వత పరిష్కారం

కక్షిదారులు రాజీమార్గంతో తమ కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సత్వర న్యాయంతో పాటు శాశ్వత పరి ష్కారం లభిస్తుందని మొదటి అదనపు జిల్లా జడ్జి బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 8న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వ ర్యంలో సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రారం భించి మాట్లాడుతూ ఏళ్ళ తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కక్షిదారులు తమ కేసు లను రాజీమార్గంద్వారా పరిష్కరించుకుంటే ధన, కాల వ్యయ ప్రయాస లను తొలగించుకోవ చ్చన్నారు. ఈ లోక్ అదాలత్‌లో పరిష్కార మైన కేసులకు అప్పీలు సౌకర్యం ఉండదని, ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణంలో మొత్తం ఆరు బెంచ్‌లు ఏర్పాటు చేయగా, మహమ్మద్ అబ్దుల్ రఫీ, పీజే సుధా, టి.హరిత, ఎ.రమేష్, వి.లీలా శ్యామసుందరి, మాధవీ దేవీ, ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహ రించి మొత్తం 219సివిల్, క్రిమినల్, కుటుంబ, మోటారు వాహన ప్రమాద, చెక్ బౌన్స్, ఫైనాన్స్ తదితర కేసులను పరిష్కరించారు.




మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి బి.శ్రీనివాసరావు

### జిల్లా వ్యాప్తంగా 826 కేసులు పరిష్కారం

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 826 కేసులు పరిష్కారం కాగా, అందులో కోవూరు 28, కోట 45, గూడూరు 142, వెంకటగిరి 42, సూళ్ళూరుపేట 52, నాయుడుపేట 70, కావలి 112, ఆత్మకూరు 28, ఉదయగిరి 29 సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించారు. తద్వారా రూ.2.02 కోట్ల పరిహారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్, బ్యాంకులు, పోలీసులు, ఫైనాన్స్ అధికా రులు, కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాడవాడలా వేడుకగా వినాయకచవితి






వినాయక చవితి వేడుకలకు నెల్లూరు నగరంలో వాడవాడలా భారీగా ఏర్పాట్లు జరిగాయి. ఈనెల 13వ తేది గురువారం వినాయకచవితి పర్వదినం సందర్భంగా యువకులు, ఉత్సవ కమిటీ నిర్వహణ బృందాలు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ప్రధాన కూడళ్ళులో జరిగే వేడుకలకు స్టేజీ అలంకరణలు, రంగురంగుల విద్యుత్ దీప అలంకరణలు, స్వాగత ద్వారాలు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం అత్యంత వేడుకగా నిర్వహించే ట్రంకు రోడ్డు శివాజీ సెంటర్లో భారీ వినాయకుడ్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా బారకాసు సెంటర్, చిన్నబజార్ రాణాప్రతాప్ సెంటర్, పెద్ద పోస్టాఫీసు వద్ద, కాపువీధి, సంతపేట, ప్రగతినగర్ సెంటర్, వెంగళ రావునగర్, శబరి శ్రీరామక్షేత్రం, వేదాయ పాళెం, స్టోన్‌హౌస్ పేట, పప్పులవీధి, పొగతోట, ఫత్తేఖాన్ పేట, టెక్కేమిట్ట సెంటర్, హరనాధపురం, కొండాయ పాళెం, రామలింగాపురం, శివప్రియ సెంటర్, రంగనాయకులపేట, మహాత్మా గాంధీ నగర్, తదితర ప్రాంతాల్లో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. బాలాజీనగర్‌లోని ఆంధ్రాబ్యాంకు ఎదురుగా వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు స్వర్ణ దేవాలయం నమూనాలో భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో తయారైన మట్టి వినాయక ప్రతిమల్ని ఈసారి ఎక్కువగా విక్రయించారు.

## మట్టి గణపతి ప్రతిమలను పంచిన సిఎంఆర్



వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో తమ ఖాతాదారులకు మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న షాపింగ్ మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, పక్కన రాజీయాడ్స్ పెంచలయ్య, శైలేష్.

## లక్ష్యసాధనపై పినాకిని లయన్స్ శిక్షణ



నెల్లూరులోని పినాకిని లయన్స్‌క్లబ్ స్థానిక దర్గామిట్టలోని హోటల్ అతిథి ఫంక్షన్‌హాల్‌లో జడ్‌సి, ఆర్‌సి క్లబ్ సందర్శన సందర్భంగా మానవసంబంధాలు, లక్ష్యసాధన అనే అంశాలపై 145మందికి శిక్షణ ఇచ్చారు. నేషనల్ ట్రైనర్ జేసి జి.అనుపమ (తిరుపతి) ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరిగింది. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. లయన్స్ పినాకిని అధ్యక్షులు లయన్ టివి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, శుభమస్తు అధినేత, క్లబ్ సభ్యుడు బివి రవికుమార్, వారి సతీమణి లయన్ బయ్యా శ్రీరంగమల్లిక కలువాయి మండలంలోని పోకూరువారిపాళెం ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పాతిక వేల రూపాయల విలువైన ఆటవస్తువులు, యూనిఫామ్‌లు బహుకరించారన్నారు. వారు ఇంకా మరెన్నో ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఆర్‌సి లయన్ ఉదయభాస్కర్, జడ్‌సి లయన్ డివి శరత్‌బాబుతో పాటు లయన్ జడ్ చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

## గురువులకు పురస్కారాలు



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తికి చెందిన గురుమిత్ర ఫౌండేషన్ వారు ఈనెల 9న నెల్లూరులోని కెఎన్‌ఆర్ నగరపాలకసంస్థ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉన్న గుండాల నరేంద్రబాబు, ఆర్.మురళి విద్యారంగానికి అందజేస్తున్న విశిష్టసేవలకు గుర్తింపుగా సన్మానించి గురుదేవోభవ పురస్కారాలను అందజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ మాజీఛైర్మెన్ కోలా ఆనంద్, గురుమిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు శ్రీమతి ఎల్.విజయ కుమారి, బి. చెంచయ్య తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను సత్కరించారు.

## వరద బాధితులకు 'ఆదిత్య' సాయం



నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ, పి.జి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అందరూ కలసి సేకరించిన 50వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ ద్వారా కేరళ వరద బాధితుల సహాయార్థం పంపారు. కళాశాల యాజమాన్యం 10వేలు, అధ్యాపకులు 12వేలు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ద్వారా సేకరించిన 28వేలు మొత్తం కలిపి 50వేలను కలెక్టర్‌కు అందించినట్లు కళాశాల కరెస్పాండెంట్ ఆచార్య ఆదిత్య తెలిపారు. డైరెక్టర్ ఎం.కృష్ణ, ప్రిన్సిపాల్స్ డి.పుల్లయ్య, కె.అంకయ్య, అధ్యాపకులు ఎన్ శైలజ, కె. గాయత్రి, విద్యార్థులు ఎం.యశస్విని, సిహెచ్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మిరెడ్డికి మొండి చేయి!



- వైసిపిలో మొదలైన అంతర్గత పోరు
- మేకపాటిని కత్తిరించకుంటే కష్టమే

బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి... వెంకటగిరి నియోజకవర్గంలో వైసిపికి ఎవరూ లేని కాలంలో నేనున్నానంటూ ముందుకొచ్చాడు. నాలుగున్నరేళ్ళు పార్టీ జెండా మోసాడు. కార్యకర్తల చేత మోయించాడు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు శాయశక్తులా కృషి చేశాడు. ఇందుకోసం ఆర్థికంగానూ ఎంతో నష్టపోయాడు. వచ్చే ఎన్నికలలో తానే అభ్యర్థినంటూ ప్రజల ముందుకు వెళ్ళాడు. విస్తృతంగా ప్రచారం చేశాడు. నియోజకవర్గంలో రాఘవకు సానుకూల వాతావరణం ఏర్పడింది. అంతా అనుకూలంగా వుందనుకున్న తరుణంలో వైసిపి అధిష్టానం నుండి ఆయనకు ఊహించని షాక్... ఇకనుండి వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా ఆనం రామనారాయణరెడ్డి వ్యవహరిస్తాడని, మీకు ప్రత్యామ్నాయంగా ఏదో ఒకటి చేస్తామని. అది కూడా పార్టీ అధినేత వై.యస్.జగన్ చెప్పలేదు. ఆయన నేరుగా మాట్లాడి పరిస్థితులను వివరించి ఎందుకు సీటు ఇవ్వలేకపోతున్నామో చెప్పివుంటే కొంతన్నా బాధ తగ్గేది. కాని ఆయన నేరుగా మాట్లాడకుండా పార్టీ జిల్లా పరిశీలకుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేత చెప్పించాడు. ఈ పద్ధతిపైనే బొమ్మిరెడ్డి రాఘవ తీవ్ర ఆగ్రహంతో వున్నట్లు తెలుస్తోంది.

ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరడం మూలంగానే వెంకటగిరి సీటు రాఘవకు లేకుండా పోయిందంటున్నారు. ఆనంను పార్టీలోకి తీసుకోవడంలో తప్పు లేదు. కాని, బొమ్మిరెడ్డిని పక్కన పెట్టాల్సిన అవసరమేముంది! 11వ తేదీ విశాఖలో జరిగిన పార్టీ ఎమ్మెల్యేలు, కో-ఆర్డినేటర్ల సమావేశానికి కూడా రాఘవను ఆహ్వానించలేదు. నాలుగున్నరేళ్ళు ఒక నియోజకవర్గంలో పార్టీని నడిపిన నాయకుడికి ఇచ్చే గౌరవమిదేనా? ఎన్నికల నాటికి పరిస్థితులను బట్టి చెప్పొచ్చుగా? అది కూడా లేదు. జిల్లాలో మేకపాటి కుటుంబానికి మూడు సీట్లు ఇవ్వాల్సిన అవసరముందా? వాళ్ళకు సొంత బలం అంటూ ఏమీ లేదు. రెండు సీట్లే వారికి ఎక్కువ. ఆనంకు ఆత్మకూరు ఇచ్చేసి.. లోక్‌సభ, ఉదయగిరి సీట్లు వారికి ఇచ్చేయవచ్చు. లేదంటే నెల్లూరు లోక్‌సభకు ఆనంను పంపించి ఉదయగిరి, ఆత్మకూరు అసెంబ్లీలు మేకపాటి కుటుంబసభ్యులకు ఇచ్చి వుండొచ్చు.

2014 ఎన్నికల్లోనే ఇవ్వాల్సిన దానికంటే మేకపాటికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీ అభ్యర్థి కావడం వల్లే పార్లమెంటు పరిధిలో వైసిపి రెండు సీట్లను చేజార్చుకుంది. జిల్లాలో స్థానాలకు తగ్గట్లు సరైన అభ్యర్థులను పెడితే ఈసారి వైసిపి గతం కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందనే ప్రచారం వుంది. కాని గతంలోలాగే మేకపాటికి ఎక్కువ సీన్ ఇచ్చి ఎంపీ అభ్యర్థిగా రాజమోహన్‌రెడ్డినే పెడితే గతంకంటే ఎక్కువ సీట్లు కాదు కదా సగం సీట్లు రావడం కూడా కష్టమే!

## కేరళ బాధితులకు అండగా..
# పేర్నాటి ట్రస్ట్ సేవలు



కేరళ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా మన జిల్లాలోని మండల కేంద్రమైన కోటలో ఉన్న పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు కొనసాగుతుండడం అభినందనీయం. ట్రస్ట్ ఛైర్మెన్, వైఎస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 6న కేరళలోని అలిప్పి జిల్లాకు వెళ్ళిన ట్రస్ట్ బృందం సభ్యులకు శ్రీశక్తి ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆహ్వానం పలికింది. అలిప్పి జిల్లాలోని నెడుముడి గ్రామ ప్రజలకు 10కిలోల బియ్యం, ఇతర సామగ్రితో కూడిన కిట్‌ను ట్రస్ట్ అందజేసింది. పగలు, రాత్రీ శ్రమించి తాము తెచ్చిన నిత్యావసర వస్తువులను, బియ్యం, మందులు ఇతరత్రా సామగ్రినంతా ట్రస్ట్‌వారు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా అలెప్పి జిల్లాలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న మన తెలుగువాడైన కృష్ణతేజ వచ్చి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. నెల్లూరు నుంచి కేరళకు వచ్చి వరదబాధితులకు మీరందిస్తున్న సేవలకు తానెంతో సంతోషిస్తున్నానంటూ సబ్‌కలెక్టర్ పేర్నాటిని అభినందించారు. 15వందల కుటుంబాలవారికి ఇప్పటిదాకా సరుకులు అందజేశామని, మొత్తంగా 3వేల కుటుంబాలవారికి సాయం అందించనున్నామని ట్రస్ట్‌వారు తెలిపారు. 9.32లక్షలు నగదు, 9టన్నుల బియ్యం, 4వందల కిలోల కందిపప్పు, 3టన్నుల ఉప్పు దాతలు ఇచ్చారన్నారు. మిగిలిన మొత్తాన్ని పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ భరించి అనుకున్న లక్ష్యంతో మొత్తంగా 50 లక్షల విలువజేసే సామాగ్రిని బాధితులకు అందించనున్నట్లు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తమతో పాటు కేరళకు వచ్చి బాధితులకు సేవ లందిస్తున్న ట్రస్ట్ సభ్యులు వేణుగోపాల్, డిఎస్సార్ గెస్ట్ ఇన్ అధినేత సురేంద్రరెడ్డికి, ఇతర మిత్రులకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

# గుర్రం జాషువా ప్రజా గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద గల జూబ్లీ హాస్పిటల్ ప్రాంగణంలో పద్మభూషణ్ గుర్రం జాషువా ప్రజా గ్రంధాలయం, భారతరత్న అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్ విజ్ఞాన కేంద్రాన్ని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఈనెల 8 న ప్రారంభించారు. తొలుత జాషువా, అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితా ప్రపంచంలో గుర్రం జాషువా శైలే వేరని పేర్కొన్నారు. గుర్రం జాషువా రచనలు సాహితీ ప్రపంచంలో చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. గ్రంథాలయానికి అవసరమైన కంప్యూటర్ల ఏర్పాటుకు ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. అనంతరం గుర్రం జాషువా కవితాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బూతపాటి కిరణ్‌శ్రీ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలోని ప్రముఖ కవుల సహకారంతో 35 వేల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. తొలుత గొలగమూడి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు,, యోగా విన్యాసాలు అందరినీ అలరించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అకాడమీ సంచాలకులు యాదగిరి, మునిసిపల్ శాఖా మంత్రి ఒయస్ డి పెంచలరెడ్డి, పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, రూరల్ ఎంఇఒ జగదీశ్వర్, గుర్రం జాషువా కవితాపీఠ ప్రచార కార్యదర్శి రాచపాళెం రఘు, అవ్వారు శ్రీధర్‌బాబు, కొమ్మల కృష్ణయ్య, బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, ప్రపంచ తెలుగు సమాఖ్య జిల్లా కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘా

## డీఎఫ్ఓ వేణుగోపాలరావు

నెల్లూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎఫ్ఒ వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఈనెల 11న ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమ రవాణా అరికట్టేందుకు తొమ్మిది బేస్ క్యాంపులు, 12 చెక్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఎర్ర చందనం అక్రమ రవాణా నియంత్రణకు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి నెల్లూరుజిల్లా మీదుగా తరలించే అధికంగా ఉన్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని రాత్రి గస్తీ తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎర్రచందనం దుంగలు తరలించిన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టినట్లు వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చిన వారికి రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. తెలిపిన వారి వివరాలు, నగదు ప్రోత్సాహం అందజేసే వివరాలు గోప్యంగా ఉంటా యని వారి భద్రతకు జాగ్రత్తలు తీసుకుంటామని, 40 మందితో ప్రత్యేక కార్యదళం నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడంలో జిల్లా మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 211 వాహనాలు పట్టుకున్నామని, తమిళ గిరిజన తెగలను ప్రలోభ పెట్టి స్మగ్లర్లు అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది కొరత ఉందని, యువత అందుబాటులో ఉండేలా నూతన నియామకాలు చేపడితే అడవుల రక్షణ మరింత పకడ్బందీగా ఉంటుందన్నారు. రేంజర్ హరి, డీఆర్ఒలు, సిబ్బంది ఉన్నారు.

# విద్యార్థులకు 'అవోపా' ప్రోత్సాహకాలు

నెల్లూరు పప్పులవీధిలో ఉన్న పాండురంగ అన్నదాన సమాజంలో ఈ నెల 9న ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో 38 మంది విద్యార్థులకు ప్రోత్సాహక సాయంగా రూ. 60వేలను అందజేశారు. ఈ సందర్భంగా 'అవోపా సంగతులు' సావనీర్‌ను ఆవిష్కరించారు. ఆర్యవైశ్య ప్రముఖులు డాక్టర్ కోట నీలమణికంఠ, డాక్టర్ శ్రీవల్లి, నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, డాక్టర్ కృష్ణమూర్తి, అవోపా అధ్యక్ష కార్యదర్శులు రమణమూర్తి, ప్రభాకర్‌రావు, కోశాధికారి కళాధర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపురం ఎస్సై, కానిస్టేబుల్ సస్పెన్షన్

నెల్లూరు జిల్లా కొండాపురం సబ్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి అంకమ్మ, కానిస్టేబుల్ శేషును ఉన్నతాధికారులు ఈనెల 9న సస్పెండ్ చేసారు. కొండాపురం ఎస్సీ కాలనీలో పేకాట స్థావరంపై ఎస్సై అంకమ్మ సిబ్బందితో ఈనెల 8న దాడులు నిర్వహించారు. ఆ సమయంలో జూదరులు తప్పించుకుని ఇళ్ళలో దాక్కున్నారు. ఇళ్ళలో ఉన్న జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకుని బయటకు తీసుకువస్తుండగా మహిళలు అడ్డుకున్నారు. ఆ సమయంలో మహిళలపై ఎస్సై అంకమ్మ, సిబ్బంది దురుసుగా ప్రవర్తించి దాడి చేశారని, పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి ఎస్సై, కానిస్టేబుల్ పై కాలనీవాసులు దాడి చేశారు. ఈ విషయమై కావలి డీఎస్పీ రఘు విచారణ జరిపారు. పేకాట జూదరులను అదుపులోకి తీసుకునే సమయంలో అడ్డు వచ్చిన మహిళలపై ఎస్సై, కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించినట్లు నిర్ధారించారు. దీనిపై కావలి డీఎస్పీ రఘు మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందాయన్నారు.



# ముందస్తు.. ముంచుతుందా?

## • కేసీఆర్‌కు విషమ పరీక్ష • ఏకమవుతున్న విపక్షాలు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనిమిది నెలల ముందుగానే ఎన్నికల కూతేసాడు. రాష్ట్ర శాసనసభను రద్దు చేసి ఎన్నికల ఘంటారావాన్ని మోగించాడు. తెలంగాణ తొలి అసెంబ్లీయే పూర్తి కాలం కొనసాగకుండా ముందస్తు ఎన్నికలకు సిద్ధమైంది. కేసీఆర్ అసెంబ్లీని రద్దు చేయడమే కాకుండా 119 స్థానాలకు గాను 105 స్థానాల అభ్యర్థులను కూడా ముందుగానే ప్రకటించేసాడు. మిగిలిన 14సీట్లను కూడా ఎంఐఎంతో బేరసారాలు కుదుర్చుకోవడానికే ఆపినట్లుగా తెలుస్తోంది.

కేసీఆర్ ఇంత ముందుగా ఎన్నికలకు సిద్ధం కావడానికి ఒకే కారణం మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికలే! ఆ రాష్ట్రాల శాసనసభలకు కూడా ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరపాలి. తెలంగాణ అసెంబ్లీకి నిర్ణీత కాలం ప్రకారమైతే 2019 ఏప్రిల్, మే నెలల్లో సాధారణ లోక్‌సభ ఎన్నికలతో పాటే ఎన్నికలు పెట్టాలి. కాని అంతకంటే ముందుగా ఈ మూడు రాష్ట్రాలలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే ఆ ప్రభావం తెలంగాణ ఎన్నికలపై పడుతుంది. కాబట్టే కేసీఆర్ ముందస్తుకు వెళ్లాడు. ఈరోజు ఆ రాష్ట్రాలతో పాటే తెలంగాణ ఎన్నికలు జరుగుతాయి. కాబట్టి అక్కడి గెలుపోటముల ప్రభావం తెలంగాణపై వుండదు. అదీగాక తెలంగాణలో ప్రస్తుతానికైతే కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత లేదు. సాధ్యమైనంత వరకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వచ్చాడు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణ రాష్ట్రం ముందున్న అతిపెద్ద సమస్య కరెంట్ కొరత. కేసీఆర్ దానిని అధిగమించాడు. కరెంట్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టాడు. భారీఎత్తున సాగునీటి ప్రాజెక్టులను మొదలు పెట్టడమే కాకుండా, మిషన్ భగీరథ పేరుతో ప్రతి చెరువునూ బాగు చేయించాడు. అనేక ప్రజాసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడు.

ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో టీఆర్ఎస్‌ను నిలువరించడం కాంగ్రెస్ ఒక్క పార్టీకే సాధ్యం కాదు. కాబట్టే కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు మహాకూటమిగా ఏర్పడ్డాయి. కేంద్రంలో నరేంద్ర మోడీని ఎదుర్కోవడానికి విపక్షాలు ఏ ఫార్ములాను అయితే అమలు చేస్తున్నాయో, అదే ఫార్ములాను ముందుగా తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో ప్రయోగించబోతున్నాయి.

కేసీఆర్‌కు కూడా తెలంగాణ ఎన్నికలు వడ్డించిన విస్తరి కాదు. బోలెడన్ని సవాళ్ళు ఆయన ముందున్నాయి. ఎంఐఎం విడిగా పోటీ చేస్తే మైనార్టీల ఓట్లు చీలిపోతాయి. కాంగ్రెస్, టీడీపీల పొత్తుతో తెలంగాణలో రెండు బలమైన సామాజిక వర్గాలు రెడ్డి, కమ్మ ఓటు బ్యాంకు ఒక్కటి కానుంది. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో కాంగ్రెస్, ఖమ్మంలో టీడీపీ కేడర్ పటిష్ఠంగా వుంది. కేసీఆర్‌కు అసలు పరీక్ష రాజధాని హైదరాబాద్‌లోనే ఎదురు కానుంది. హైదరాబాద్ సిటీలో టీఆర్ఎస్‌కు సంస్థాగత బలం తక్కువ. 2014 ఎన్నికల్లో కూడా ఇక్కడ ఎక్కువ స్థానాలు కాంగ్రెస్, టీడీపీనే గెలుచుకున్నాయి. రెండేళ్ళ క్రితం జరిగిన జీహెచ్ఎంసి ఎన్నికల్లో మాత్రమే హైదరాబాద్‌లో టీఆర్ఎస్ జెండా ఎగిరింది. సెటిలర్లు ఎక్కువగా టీఆర్ఎస్ వైపు మొగ్గుచూపడం వల్లే ఆ పార్టీ 99డివిజన్‌లు గెలిచి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. అప్పట్లో టీఆర్ఎస్‌కు అండగా నిలిచిన సెటిలర్లు అలాగే వుంటే టీఆర్ఎస్ ఈసారి సిటీలోని మెజార్టీ స్థానాలు గెలవగలదు. లేదంటే ఇబ్బంది తప్పదు.

ముందస్తు ఎన్నికలకు పోయిన పార్టీలు బొక్కబోర్లా పడుతాయనే సెంటిమెంట్ వుంది. 2004లో కేంద్రంలో బీజేపీ, ఏపిలో టీడీపీ పరిస్థితి అదే! అలాగే గతంలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాలలో మొదటిసారి గెలిచిన పార్టీ ఏదీ రెండోసారి అధికారంలోకి రాలేదు. ఈ సెంటిమెంట్‌ను కేసీఆర్ ఎంతవరకు అధిగమిస్తాడో చూడాలి!

# వేదాంతదేశికర్ తిరునక్షత్ర మహోత్సవాలు



నెల్లూరు రంగనాయకులపేటలోని వేదాంతదేశికుల వారి ఆలయంలో ఈ నెల 12 నుంచి 22వ తేది వరకు 750వ జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వేదాంతదేశికర్ దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ కెసి వరదరాజన్, కె.రామదురై, ఎన్.వి బాలాజీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయంతి మహోత్సవాల పత్రికలను కె.జగన్నాథాచార్యులు, మేల్కోట్టై నరసరాజ భట్టర్‌లు ఆవిష్కరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం సాయంత్రం వాహనోత్సవ కార్యక్రమాలుంటాయన్నారు. 14వ తేదీన శ్రీ వేంకటేశ్వరస్వామికి గరుడసేవ, 16వ తేదీన హయగ్రీవ హోమం ఉంటాయని, 21న తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని వేదాంతదేశికుల వారికి పుష్పపల్లకీ మహోత్సవం, శాత్తుమొర, మంగళాశాసనాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాజగోపాల్, కెసి నరసింహ, కె.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణపై విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని బివిఎస్ బాలికల పాఠశాలలో ఈనెల 7న విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన కలిగించారు. రుద్రమదేవి సెల్ఫ్‌డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ రవి, లక్ష్మి, జిల్లా కో-ఆర్డినేటర్ భరద్వాజ్‌రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, కరాటే మాస్టర్లు ఆదినారాయణ, సరిత పాల్గొన్నారు.

# అపవిత్ర బంధం!

(మొదటి పేజీ తరువాయి)

నినదించిన తెలుగుజాతి ఆత్మగౌరవానికి వెన్నుపోటు పొడుస్తారా? తెలంగాణ, ఏపిలోని టీడీపీ నాయకులు కాంగ్రెస్‌తో కలిసి ఎలా పని చేయగలరు? టీడీపీ జెండా పట్టుకున్న చేతితో కాంగ్రెస్ జెండాను ఎలా పట్టుకోగలరు? ఆంధ్రప్రదేశ్‌ను కుక్కలు చింపిన విస్తరి చేసిన కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ఓట్లు ఎలా అడగ్గలరు? కాంగ్రెస్‌తో పొత్తుపై ఇప్పటికే ఏపిలో కొందరు నాయకులు నిరసన గళం వినిపించి వున్నారు. రేపు చంద్రబాబు వాళ్ల నోళ్ళు మూయించగలడా? లేక వాళ్ళే నోర్లు మూసుకుని చంద్రబాబు దారిలో నడవగలరా? సరే నాయకులను, ఎన్టీఆర్ కుటుంబసభ్యులను చంద్రబాబు నోరు మూయిస్తాడనుకుందాం! ఎన్టీఆర్ అభిమానులు, ప్రజలు అలా కాదుకదా! కాంగ్రెస్‌తో జతకట్టి వచ్చిన చంద్రబాబు వారి దృష్టిలో ఒక అవకాశ వాదిగానే మిగిలిపోతాడు!

టీడీపీ, కాంగ్రెస్ పొత్తు అన్నది తొలి ప్రయోగం. ముందు తెలంగాణలో ఈ ప్రయోగం జరుపుతున్నారు. అక్కడ విజయవంతమవుతుందో, వికటిస్తుందో చూడాలి. తెలంగాణలో అటూ ఇటుగా వున్నా ఖచ్చితంగా ఏపి ప్రజలు మాత్రం ఛీ కొడతారు. ఎందుకంటే కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర విభజన పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు చేసిన అన్యాయాన్ని, ఆనాటి దుర్మార్గపు చర్యలను ఆంధ్రులెవరూ మరచిపోలేదు!

# గతేంటి?

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాలంటూ ఏపిటిఐడిసి మేనేజింగ్ డైరెక్టర్‌కు, నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే వాళ్ళు వివరణ ఇవ్వడం ఆలస్యం కావడంతో ఈ నెల 5వ తేదీన ఈ నిర్మాణాలను వెంటనే ఆపాలంటూ స్టే విధించింది. ఇళ్లను మొదలుపెట్టిన దశలో స్టే ఇస్తే ఏ ఇబ్బందీ వుండదు. ఇళ్ళు పూర్తయిన తరుణంలో, ఇక ఇళ్లను లబ్దిదారులకు అందజేసి ఓట్లపరంగా లబ్ది పొందుతామని అధికారపార్టీ నాయకులు అంచనాలు వేసుకుంటున్న తరుణంలో ఇలా కోర్టు స్టే ఇవ్వడం తెలుగుదేశం నాయకులకు మింగుడు పడడం లేదు.

# తోడుగా రామ్

(మొదటి పేజీ తరువాయి)

నేదురుమల్లి అభిమానులు, అనుచరులు పెద్దసంఖ్యలో వాహనాలలో వాకాడు నుండి విశాఖపట్నంకు బయలుదేరి వెళ్లారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన నాయకులు, అనుచరులు పెద్దసంఖ్యలో తరలి రావడం జరిగింది. నేదురుమల్లి రామ్‌కుమార్‌తో పాటు తిరుపతి మాజీ ఎంపి వి.వరప్రసాదరావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసిపి సిఇసి సభ్యులు ఎల్లసిరి గోపాలరెడ్డి, గూడూరు వైసిపి ఇన్‌ఛార్జ్ మేరిగ మురళీ, కోట ఎంపిపి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ తదితరులు విశాఖకు వెళ్లారు.

● 'దేశం'లో కుల చిచ్చు

# బాబుపై కన్నెర్రజేస్తున్న 'కమ్మోరు'



సొంత బిడ్డ వద్దు... పరాయి బిడ్డ ముద్దా... కానివారికి కంచాలలో... అయిన వారికి ఆకుల్లోనా... మా పార్టీలో మేమే కానివాళ్ళమయ్యామా? వాళ్ళకేమో పెద్దపీట... మాపై చిన్నచూపా... నెల్లూరుజిల్లా తెలుగు దేశం పార్టీలో చంద్రబాబు నిర్ణయాలపై కుతకుత ఉడికిపోతున్న కమ్మ సామాజికవర్గ నేతల మనోవేదన ఇది. ఇటీవల నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ఈ వర్గీయులంతా ఒకేచోట చేరి నిరసన గళం విప్పడం జిల్లా రాజకీయాలలో సంచలనాత్మకంగా మారింది.

తెలుగుదేశం అంటేనే కమ్మ సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చే పార్టీ అని లెక్క! అయితే బయట జిల్లాల్లో ఎలా వున్నా నెల్లూరుజిల్లా వద్దకొచ్చేసరికి ఏ పార్టీ అయినా రెడ్లకు ప్రాధాన్యత ఇవ్వక తప్పదు. ఇక్కడ చంద్రబాబు లెక్క కూడా ఒక్కటే! కమ్మ కులస్థులు ఎలాగూ తెలుగుదేశంకే ఓట్లేస్తారు. సీట్ల విషయంలో రెడ్లకు ప్రాధాన్యతనిస్తే వారి ఓటు బ్యాంకులో చీలిక తేవొచ్చని ఆయన ఆలోచన. అందుకే రెడ్లకు ప్రాధాన్యత పెంచాడు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. అలాగే నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా కూడా వున్నాడు. ఇటీవల ఆనం రామనారాయణరెడ్డి పార్టీని వీడిపోవడంతో ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా ఆదాలనే పెట్టడం జరిగింది. ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ కోసం ఇక్కడ కమ్మ సామాజిక వర్గానికి చెందిన గూటూరు కన్నబాబు తీవ్రంగా ప్రయత్నించాడు. పార్టీ ఆఫీసులో కూడా ఆందోళనకు దిగాడు. అయినా ఆయనను పక్కనపెట్టి ఆదాలను ఇన్‌ఛార్జ్‌గా పెట్టారు. 2015లో ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరినప్పుడు అప్పటిదాకా ఇన్‌ఛార్జ్‌గా వున్న కన్నబాబును పక్కకు నెట్టేసి ఆనంకు ఆత్మకూరు బాధ్యతలు అప్పగించారు. ఇలా 'రెడ్ల' మూలంగా కన్నబాబు రెండుసార్లు ఇన్‌ఛార్జ్ హోదాను కోల్పోయాడు.

2014 ఎన్నికల్లో జిల్లాలో ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి సీట్లను కమ్మ సామాజికవర్గం నేతలకు కేటాయించారు. వాటిలో రెండింటిలో గెలిచారు. అయితే ఈసారి మూడింటిలో రెండు సీట్లలో 'రెడ్డి' సామాజిక వర్గం అభ్యర్థులను నిలబెట్టాలనే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకటగిరి, ఉదయగిరిలలో సిటింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత వుండడంతో అభ్యర్థులను మారుస్తారనే ప్రచారం వుంది. అలాగే నెల్లూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో అభ్యర్థుల ఎంపికలో పార్లమెంటు ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డికే అధిక ప్రాధాన్యతనిస్తుండడం కూడా ఈ వర్గీయులకు మింగుడు పడడం లేదు.

ఈ అసంతృప్తితోనే ఇటీవల తిరుపతిలో నెల్లూరుజిల్లా కమ్మ సామాజికవర్గ నేతలు కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, బొల్లినేని కృష్ణయ్య, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కన్నబాబు, కిలారి వెంకటస్వామినాయుడు తదితర నేతలంతా హాజరై చంద్రబాబుపై తమ ఆవేదన వెళ్లగక్కారని తెలుస్తోంది. వీళ్ళు సమావేశమైన విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తోంది.

# ఒక్క ఛాన్స్.. ప్లీజ్



- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనకు మంచి స్పందన
- ప్రజాపోరాటాలలో శ్రీధర్‌రెడ్డి పనితీరు ఆదర్శమంటూ అభినందించిన జగన్
- నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశంలో శ్రీధర్‌రెడ్డికి ప్రత్యేక ప్రాధాన్యత



"ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్..." ఈ డైలాగ్ వింటే గుర్తొచ్చేది కృష్ణ వంశీ దర్శకత్వంలో వచ్చిన 'ఖడ్గం' సినిమా! ఆ సినిమాలో హీరోయిన్‌గా నటించిన సంగీత సినిమాలలో హీరోయిన్ ఛాన్స్ కోసం వచ్చి "ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్" అని బ్రతిమ లాడుకుంటుంది. ఒక్క ఛాన్స్ ఇస్తేనే మనం వారిలో ఆ టాలెంట్‌ను చూడగలం. ఈ దేశ ప్రజలు అటల్ బిహారీ వాజ్‌పేయికి ఒక్క ఛాన్స్ ఇవ్వబట్టే దేశమంతటా స్వర్ణచతుర్భుజీ నాలుగులైన్ల జాతీయ రహదారులు ఏర్పడ్డాయి. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డికి ఆ ఒక్క ఛాన్స్ ఇవ్వబట్టే నిరుపేదలను సైతం కార్పొరేట్ హాస్పిటల్స్ లిఫ్ట్ ఎక్కించే ఆరోగ్యశ్రీ పుట్టుకొచ్చింది. 108 అంబులెన్స్ ఆవిష్కృతమైంది. పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వచ్చి చిరుద్యోగులుగా మిగిలిపోవాల్సిన లక్షలాది మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యారు. అలాంటి ఒక్క ఛాన్స్ ఇప్పుడు మన ప్రియతమ నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి అడుగుదాం... ఎవరికైనా అవకాశం ఇస్తేనే కదా వారి ప్రతిభ తెలిసేది. అలాగే మన జగనన్నకు సీఎంగా ఒక్క అవకాశం ఇవ్వమని ప్రజల ముందుకు పోదాం... అంటూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు వైసిపి నేతలు, కార్యకర్తల్లో ఊహించని స్పందన వచ్చింది. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్క ఛాన్స్ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైసిపి శ్రేణులు ఉత్సాహంతో ఉరకలెత్తుతున్నాయి.

ఈ నెల 11వ తేదీన విశాఖపట్నంలో 175 నియోజకవర్గాలకు చెందిన వైసిపి ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో వైయస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించాడు. ఈ సమావేశంలో ప్రశాంత్ కిషోర్ టీం సభ్యులు బూత్‌కమిటీలు, ఓటర్ల చేర్పులు, ప్రచార సరళి వంటి వాటిపై సూచనలిచ్చారు. వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఒక్కడే ఈ సమావేశంలో ప్రసంగించాడు. ఈ సందర్భంగా ఆయన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రలను ప్రశంసించారు. ఓటర్ల తొలగింపుపై ఆయన చేస్తున్న పోరాటం, ఓటర్ల చేర్పులపై చూపిస్తున్న ఆసక్తిని, అనునిత్యం ప్రజల మధ్య వుంటూ ప్రజాసమస్యలపై ఆయన పోరాడుతున్న విధానాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని సూచించారు.

ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యేలు, కోఆర్డినేటర్‌లలో కోటంరెడ్డి ఒక్కడికే ప్రసంగించే అవకాశం ఇవ్వగా, ఆయన తన ప్రసంగంలో 'మన రాజన్న బిడ్డకు ఓ అవకాశం ఇద్దాం' అనే నినాదాన్ని రాష్ట్రంలో దశదిశలా వ్యాప్తి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్టీ శ్రేణులు ఇస్తున్న 'రావాలి జగన్ - కావాలి జగన్' అనే నినాదానికి తోడుగా 'మన రాజన్న బిడ్డకు ఓ అవకాశం ఇద్దాం' అనే నినాదాన్ని ప్రచారంలోకి తెస్తే ప్రజల మనసుల్లోకి ఎక్కుతుందని, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తుందని అభిప్రాయపడ్డారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన సూచనపై సమావేశంలోని అందరూ అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

# రామాయపట్నం.. వచ్చేనా? ఒట్టిదేనా?

ఎట్టకేలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం



ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పత్రికలకు, ప్రకటనలకు ఎక్కుతుంటాయి. అది తర్వాత రానీయండి, రాకపోనీయండి... ముందు పేపర్లలో అయితే హడావిడి కనిపిస్తుంటుంది. ఈ కోవకు చెందిందే రామాయపట్నం పోర్టు. ప్రధాన పార్టీల నాయకులకు రాజకీయ ఆయుధం. రామాయపట్నం ప్రకాశం జిల్లా పరిధిలోదే అయినప్పటికీ కావలి నియోజకవర్గ నాయకులే దీనిపై ఎక్కువ ఆసక్తి కనపరిచారు. ఎందుకంటే ఈ పోర్టు వస్తే ఎక్కువగా అభివృద్ధి చెందేది కావలి ప్రాంతమే కాబట్టి!

సాంకేతిక, పర్యావరణ కారణాల దృష్ట్యా నెల్లూరుజిల్లా దుగరాజపట్నం వద్ద కేంద్రం తలపెట్టదలచిన పోర్టు సాధ్యం కాదని తేల్చడంతో కావలి నాయకులు ఆ పోర్టును రామాయపట్నం వద్ద కట్టాలంటూ డిమాండ్ చేసారు. ఈ మేరకు మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, దీనిపై పాదయాత్రలు, పోరాటాలు చేయడం తెలిసిందే! కేంద్ర ప్రభుత్వానికి ఇక్కడ పోర్టు నిర్మించాలంటూ స్థానిక నాయకులు ఎన్నోసార్లు విన్నవించుకున్నారు.

ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ మినీపోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రామాయపట్నం పోర్టు కోసం కృష్ణపట్నం పోర్టు పరిధిని తగ్గించారు. అయితే రామాయపట్నం వాణిజ్య పరమైన పోర్టు కాదు. స్థానికంగా వుండే పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగానే ఇక్కడ పోర్టు నిర్మాణం చేపడతారు. కమర్షియల్ పోర్టుగా కృష్ణపట్నం పోర్టు వుండడంతో సమీపంలో మరో కమర్షియల్ పోర్టు నిర్మాణానికి నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయి. అదీగాక కృష్ణపట్నం పోర్టుకు రామాయపట్నంకు దూరం 70కిలోమీటర్ల లోపే! ఇంత పరిధిలోనే ఇంకో కమర్షియల్ పోర్టుకు తగ్గ వ్యాపారం లేదు. రామాయపట్నం పోర్టు కట్టగానే సరికాదు... దానికి తగ్గ పరిశ్రమలు రావాలి. ప్రకాశం జిల్లాలో గ్రానైట్ తప్పితే ఇతర పరిశ్రమలు లేవు. కొత్తగా పరిశ్రమలు వస్తే తప్పితే రామాయపట్నం పోర్టుకు అంతగా వ్యాపారం వుండదు. పరిశ్రమలు, ఎగుమతులు, దిగుమతులు లేకుండా పోర్టు కట్టడమంటే ప్రయాణీకులు లేని ఊరిలో హైటెక్ బస్టాండ్ కట్టడమే అవుతుంది.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com